ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



సమావేశ ప్రారంభంలో మేయరు పక్కన ఎంపీ, ఎమ్మెల్సీ, కమిషనర్ - ఎమ్మెల్యే శ్రీనివాసులు సూచన తరువాత దూరంగా సీట్లు మార్చుకున్న ఎంపీ,ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కమిషనర్



తిరుపతి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం తీరు మారింది. కొందరు వైసీపీ కార్పొరేటర్ల స్వరం మారింది. పలువురు గత వైసీపీ పాలనపై అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేయడం చర్చగా మారింది. మొత్తానికి కార్పొరేటర్లు స్వేచ్ఛగా తమ భావాలను పంచుకునేందుకు కౌన్సిల్ భేటీ వేదికగా మారింది. మేయర్‌కు తగిన గౌరవం దక్కడంతో ఆమె కళ్లలో ఆనందం కనిపించింది. ఎక్స్‌అఫిషియో సభ్యులుగా వచ్చిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు, ఎంపీ గురుమూర్తికి పార్టీలకతీతంగా అభినందనలు తెలపడం కౌన్సిల్ గౌరవాన్ని పెంచింది.

కౌన్సిల్ గొంతుమారింది

- మేయర్‌కు సముచిత గౌరవం
- నగరాభివృద్ధికి కలసి పనిచేద్దామని రాజకీయాలకతీతంగా పిలుపు
- ఎమ్మెల్యేకి అభినందనల వెల్లువ

తిరుపతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది కలిసి రాజకీయాలకతీతంగా పని చేద్దామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం బుధవారం ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్లో మేయర్ శిరీష అధ్యక్షతన జరిగింది. ప్రత్యేక ఆహ్వానితులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం హాజరయ్యారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కమిషనర్ అదితిసింగ్ అజెండా తీర్మానాలను ప్రవేశపెట్టగా కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు అజెండాలోని అంశాలపై చర్చించి ఆమోదించారు. టీడీఆర్ బాండ్లపై వస్తున్న ఆరోపణలపై నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే శ్రీనివాసులు కోరారు. ఆగస్టు 15 లోపు అన్న క్యాంటీన్, డొక్కా సీతమ్మ క్యాంటీన్లు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతిలో అండర్ డ్రైనేజీ సిస్టమ్(యూడీఎస్) కాలం తీరిపోవడంతో కొత్తగా యూడీఎస్‌ను ఏర్పాటు చేసుకోవల్సిన అవసరం ఉందన్నారు. శానిటేషన్ మెరుగు పరుచుకోవల్సిన అవసరం వుందని, తాగునీటిని శుభ్రంగా సరఫరా జరిగేలా చూడాలని, అంతర్గత రహదారులను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మేయర్ శిరీష మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎంపీ సహకారంతో తిరుపతి అభివృద్ధి కోసం అధికారులతో కలసి కార్పొరేటర్లు అందరం కృషి చేద్దామన్నారు. కమిషనర్ అదితిసింగ్ మాట్లాడుతూ కార్పొరేటర్లు తెలియజేసే సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు.పెరుగుతున్న జనాభా, యాత్రికుల వలన కాలం చెల్లిన యూడీఎస్ ప్రక్షాళనకు కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చేందుకు సహకరిస్తామని ఎంపీ గురుమూర్తి తెలిపారు. అధికారులు కొత్త యూడీఎస్ కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్పొరేషన్ అభివృద్ధి పనులపై కార్పొరేటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు.ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ అందరూ సమన్వయంతో కలిసికట్టుగా నగరాభివృద్ధికి కృషి చేద్దామన్నారు.కార్పొరేటర్లకు నెలకోసారైనా శ్రీవారి దర్శనం కల్పించాలని గతంలో కోరినా నెరవేరలేదని, ఈసారైనా ఎమ్మెల్యే కృషిచేయాలని కోఆప్షన్ మెంబర్ శ్రీదేవి కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ టీటీడీ ఈవో దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.

మారిన స్వరాలు



ఐదేళ్లు నరకమనుభవించాం : డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

కార్పొరేషన్లో గత ఐదేళ్లు నరకం అనుభవించామని వైసీపీ నేత, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు కట్టిన పన్నులకు లెక్కలు లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్నారు.కార్పొరేషన్లో తమకు తెలియకుండా చాలా జరిగిపోయాయని,అందుకే ప్రజలు భారీ మెజారిటీతో జనసేన పార్టీని గెలిపించారన్నారు. కార్పొరేషన్ అవినీతిపై విచారణ జరిపించాలని సీఎం, డిప్యూటీ సీఎంలకు ఫిర్యాదు చేస్తామన్నారు.

కార్పొరేటర్ అంటే ఇంతకాలం తెలియలేదు
దొడ్డారెడ్డి ప్రతాప్ రెడ్డి

ఇంతకాలం కార్పొరేటర్ అంటే ఏమిటో ఎవరికీ తెలియలేదని, ఇప్పుడైనా మనమేంటో తెలుసుకోవాలని 10వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రతాప్ రెడ్డి అన్నారు. టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై విచారణ జరిపించి, వాస్తవాలు ప్రజలకు తెలపాలన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల నాణ్యత పరీక్షించిన తర్వాతే పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. డబుల్ డెక్కర్ బస్సును కంపోస్ట్‌యార్డులో పెట్టడం బాధాకరమని, దానిని అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గతంలో శ్రీకృష్ణ దేవరాయల కాంస్య విగ్రహాన్ని తొలగించి, ఎక్కడో పడేసి, ఆ స్థానంలో లక్షలాది రూపాయలు వెచ్చించి ఫైబర్ విగ్రహం పెట్టి ప్రజల మనోభావాలను దెబ్బతీశామన్నారు.



● మేయర్‌కు దక్కిన గౌరవం

తిరుపతి ప్రథమ పౌరురాలు, మేయర్ శిరీషకు కౌన్సిల్ సమావేశంలో తగిన గౌరవం దక్కింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశాల్లో అప్పటి ఎమ్మెల్యే కరుణాకర రెడ్డి తమ పార్టీకే చెందిన మేయర్ శిరీషను గాజుబొమ్మను చేసి కూర్చోబెట్టారన్న విమర్శలొచ్చాయి. మేయర్ కుర్చీకి ప్రాధాన్యత ఇవ్వకుండా పక్కన ఎమ్మెల్యేతో పాటు కమిషనరు కూర్చోవడం అనేక ఆరోపణలకు తావిచ్చిన విషయం తెలిసిందే. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బుధవారం తొలి సమావేశం జరిగింది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఎక్స్‌అఫిషియో సభ్యుడి హోదాలో సమావేశానికి హాజరయ్యారు. అప్పటికే వేదికపై మేయర్‌కు అటూ,ఇటూ వైసీపీ ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, కమిషనర్ అదితిసింగ్ ఆసీనులయ్యారు. ఎమ్మెల్యేకి కూడా మరొక కుర్చీని వేసి వుంచారు. సమావేశం ప్రారంభమవుతుండగా ఎమ్మెల్యే సెనేట్ హాలుకు చేరుకున్నారు. వేదికపైన ఉన్న తన కుర్చీని కిందవేయమని అధికారులకు సూచించారు. దీంతో ఎంపీ, ఎమ్మెల్సీ కూడా కిందకు దిగేశారు. కమిషనర్ మాత్రం మేయర్ పక్కనే కూర్చుండిపోయారు.మేయర్‌తో సమానంగా ఎవ్వరూ కూర్చోవద్దని, ఆ కుర్చీకి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వాలని, కమిషనర్ దృష్టికి కూడా తీసుకెళ్లమని ఏడీసీ చరణ్‌తేజ్ రెడ్డిని ఎమ్మెల్యే పిలిచి చెప్పారు. సమాచారం తెలుసుకున్న కమిషనర్ తన కుర్చీ స్థానాన్ని కూడా మార్చుకున్నారు. ఈ పరిణామాలను గమనిస్తున్న కార్పొరేటర్లు, అధికారులు మేయర్‌కు దక్కిన గౌరవాన్ని చర్చించుకోవడం కనిపించింది. ఇంతలో టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ లేచి తమ కూటమి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వ్యక్తిత్వానికి ఇలాంటి ఘటనే నిదర్శనమన్నారు. పార్టీలకతీతంగా గౌరవించడం ఎన్డీఏ నేతల అభిమతమన్నారు. ఇకపై కార్పొరేటర్లు కూడా వారి డివిజన్లలో స్వేచ్ఛగా ప్రజలకు సేవలందించవచ్చన్నారు. పలువురు అభినందనలు తెలపడంతో మేయర్ కళ్లలో ఆనందం కనిపించింది.

నిబంధనలకు గండి..
అక్రమార్జన దండి



రాపూరు-గూడూరు మార్గంలో అక్రమ లే అవుట్లు

- పుట్టగొడుగుల్లా అక్రమ లే అవుట్లు
- అనుమతులు లేకుండానే ప్లాట్ల అమ్మకాలు
- అధికారుల దన్నుతో పైసా చెల్లించని వైనం

వెంకటగిరి, జూలై 10 : వెంకటగిరి నియోజకవర్గంలో వెలసిన అక్రమ లే అవుట్లతో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోంది. వెంకటగిరిలో 32 లే అవుట్లు ఉన్నాయి. వీటిలో రెండింటికి మాత్రమే అనుమతులు తీసుకున్నారని మున్సిల్ అధికారులే చెబుతున్నారంటే పరిస్థితి తీవ్రత అర్థమవుతోంది. వైసీపీతో ఇన్నాళ్లూ అంటకాగిన అధికారులు వీటి గురించి అసలు పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. కొందరు ఒక అడుగు ముందుకేసి ప్రభుత్వ భూముల్లో సైతం లే అవుట్లు వేసి సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. వైసీపీ నేతలకు ముడుపులు ముట్టచెప్పి అక్రమంగా లే అవుట్ల ద్వారా కొందరు భారీగా ఆర్జించారు. ఇరుకైన రోడ్ల మధ్య ఎలాంటి వసతులు కల్పించకుండానే లే అవుట్లు వేసి ప్లాట్లు అమ్మేస్తున్నారు.

ఇవీ నిబంధనలు

- వాస్తవానికి లే అవుట్ వేయకమునుపే ప్రభుత్వ అనుమతి ఉండాలి.
- ప్లాట్లు విక్రయించాలంటే మున్సిపాల్టీకి చలానా చెల్లించి అనుమతులు పొందాలి.
- లే అవుట్లలో 40 అడుగుల వెడల్పుతో రోడ్లు నిర్మించాలి.
- ప్లాట్ కొన్న వ్యక్తి ఇల్లు కట్టుకునేలా విద్యుత్ లైన్, మంచినీటి కుళాయి, గ్రీనరీతో పాటు విస్తీర్ణాన్ని బట్టి 10 శాతం పబ్లిక్ స్థలం వదిలి పెట్టాలి.
- పబ్లిక్ స్థలాన్ని గుడి, బడి, ఆటస్థలం వంటివి నిర్మించుకొనేందుకు కేటాయించాలి.

దర్జాగా ఆర్జన

ఇక్కడి చాలా లేఅవుట్లలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు పాటించలేదు. సరికదా అనుమతులు కూడా లేకుండా 30 అనధికార లే అవుట్లు వేసి ప్లాట్లు కూడా విక్రయించేసుకున్నారు. రాపూరులో అసైన్‌మెంటు స్థలాల్లో కూడా కొంతమంది వైసీపీ చోటా నాయకులు లే అవుట్లు వేసి ప్లాట్లు విక్రయించేశారు. తెలిసో తెలియకో ప్లాట్లు కొన్న బాధితులు ఇప్పుడు లబోదిబో మంటున్నారు. రాపూరు-గూడురు, రాపూరు-నెల్లూరు మార్గాల్లో 20కి పైగా లే-అవుట్లలో ఒక్కదానికీ పంచాయితీ అనుమతులు లేవని స్థానికులు తెలిపారు. ఇక్కడ ఓ చోటా నాయకుడు వీటిద్వారా రూ.కోట్లు గడించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎన్‌హెచ్-565 జాతీయ రహదారికి ఆనుకుని పెనుబర్తి, గోనుపల్లి, డక్కిలి ప్రాంతాల్లో రోడ్డుకు ఇటు అటు పదుల సంఖ్యలో లే అవుట్లు వెలిశాయి. వీటిలో ఒక్కదానికీ అనుమతి లేదని తెలిసింది. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో మున్సిపల్ పరిధిలో బఫర్ జోన్ ప్రాంతాల్లో అనుమతులు లేకుండానే బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టారు. ఇలా నిబంధనలకు, ప్రభుత్వాదాయానికి తూట్లు పొడిచినా అధికారులు మిన్నకుండిపోయారు. కొత్త ప్రభుత్వంలో వీటిని కట్టడి చేయాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.





తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో
గంజాయి స్వాధీనం

రేణిగుంట, జూలై 10: తిరుమల ఎక్స్‌ప్రెస్ రైల్లో స్పెషల్ పార్టీ పోలీసులు 43 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.గాజులమండ్యం సీఐ సుబ్బరాయుడు కథనం మేరకు... 15రోజులుగా గూడూరు రైల్వేస్టేషన్ నుంచి తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో పోలీసులు జనరల్ బోగీల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 43కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోగా, బుధవారం మాత్రమే 12కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో, రైల్వేస్టేషన్ సమీపంలో తనిఖీలు నిర్వహించారు.

టీడీపీలోకి కుప్పం మున్సిపల్ చైర్మన్?
9 మంది కౌన్సిలర్లతో అమరావతికి పయనం

కుప్పం, జూలై 10: కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, 9 మంది కౌన్సిలర్లతో అమరావతికి పయనమై వెళ్లినట్లు తెలిసింది. వైసీపీకి చెందిన చైర్మన్, టీడీపీలో చేరేందుకే బయలుదేరి వెళ్లినట్లు కుప్పంలో విస్తృతంగా ప్రచారమవుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు... మూడేళ్ల క్రితం జరిగిన కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించింది. అప్పట్లో మంత్రిగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కనుసన్నల్లో అధికార యంత్రాంగం వ్యవహరించింది. మొత్తం 25 వార్డుల్లో 19 వార్డుల్లో వైసీపీ విజయం సాధించింది. టీడీపీ నుంచి ఆరుగురు కౌన్సిలర్లు ఎన్నికయ్యారు. మున్సిపల్ చైర్మన్‌గా డాక్టర్ సుధీర్ ఎన్నికయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం తర్వాత చైర్మన్ సహా మెజారిటీ వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరికకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అయితే వైసీపీనుంచి ఎవరినీ తీసుకోవద్దన్న పాలసీ మేరకు వారి ప్రయత్నాలు సాగలేదు. కానీ వారు ప్రయత్నం చేయడం మాత్రం మానలేదు. మరోవైపు చిత్తూరు కార్పొరేషన్‌లో మేయరు, పలువురు కార్పొరేటర్లు టీడీపీ, జనసేనలో చేరడంతో కౌన్సిల్ కూటమి వశమైంది. ఇక, పుంగనూరులో మున్సిపల్ చైర్మన్ సహా 11 మంది కౌన్సిలర్లు వైసీపీకి రాజీనామా చేశారు. త్వరలో టీడీపీలో చేరనున్నారు. ఈ నేపథ్యంలో కుప్పం మున్సిపాలిటీలోనూ చేరికలకు మార్గం ఏర్పడిందని చెబుతున్నారు. ప్రయత్నాలు తుది దశకు చేరినందువల్లే మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ మరో 9 మంది కౌన్సిలర్లతో అమరావతి వెళ్లినట్లు తెలిసింది. అయితే స్థానిక టీడీపీ నేతలు ఎవరికీ వీరి చేరికకు సంబంధించిన సమాచారం లేదు. అన్నమయ్య జిల్లాకి చెందిన మంత్రి ద్వారా మున్సిపల్ చైర్మన్ సుధీర్ ముమ్మర ప్రయత్నాలు చేయడంవల్లే ఒకింత సానుకూల వ్యక్తమయినట్లు తెలిసింది. నేడో రేపో చేరికలు జరిగిపోవడం ఖాయమన్న ప్రచారం కుప్పంలో జోరుగా సాగుతోంది. ఈ విషయం టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త కంచర్ల శ్రీకాంత్‌కు తెలిసే జరిగిందా లేదా ఆయన పరోక్షంలో జరిగిందా అన్న విషయంలో సందిగ్ధత నెలకొంది. ఆయనకు తెలిసే జరిగిందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. ఎమ్మెల్సీకి తెలియకుండా చేరికలు జరిగే అవకాశం ప్రస్తుతం నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితుల్లో కనిపించడంలేదు. దీనిపై ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను వివరణ కోరడానికి ప్రయత్నించగా ఆయన ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు. మరోవైపు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కు ఫోన్ చేయడానికి ప్రయత్నించగా ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది.

ఏసీబీ వలలో విలేజ్ సర్వేయర్



సర్వేయర్ గణేష్

సత్యవేడు, జూలై 10 : పొలం హద్దుల గుర్తింపు కోసం రైతు నుంచి లంచం తీసుకుంటున్న ఓ సర్వేయర్‌ను బుధవారం ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి కథనం మేరకు ...సత్యవేడు మండలం కన్నవరం గ్రామానికి చెందిన వేమల భాస్కర్ తన పిత్రార్జితమైన భూమికి సంబంధించి ఎఫ్-లైన్ సర్వే రిపోర్టు(హద్దుల గుర్తింపు) కోసం సంబంధిత సచివాలయంలో ఆరు నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నాడు. సర్వేకోసం ట్రెజరీలో చలానా చెల్లించి సర్వేయర్ గణేష్‌ను కలిశాడు. సర్వే చేయాలంటే రూ.ఆరువేలు తనకు ఇవ్వాలని సర్వేయర్ గణేష్ డిమాండ్ చేశాడు.దీంతో భాస్కర్ ముందస్తుగా రూ. రెండు వేలను తన బావమరిది ఫోన్ నుంచి ఫోన్‌పే చేశాడు.మరోవైపు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు పథకం ప్రకారం సర్వేయర్ గణేష్ రైతు భాస్కర్ నుంచి రూ.4వేలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.గణేష్‌ను ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నారు.ఎస్ఐలు ఈశ్వర్, సునీల్, శివనారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఫస్ట్‌పేజ్‌లో సీటు పొందిన విద్యార్థులూ అర్హులే
నేటినుంచి పాలిసెట్ కౌన్సెలింగ్ ఆప్షన్ల నమోదు

తిరుపతి(విద్య), జూలై10: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈనెల14వరకు నిర్వహించే చివరివిడత కౌన్సెలింగ్‌కి సంబంధించి గురువారం నుంచి ఆప్షన్లను నమోదు చేసుకోవచ్చు. మొదటిదశలో సీటు వచ్చిన విద్యార్థులు కూడా తిరిగి కళాశాల, కోర్సులు మార్పులు, చేర్పులకోసం ఆప్షన్లను నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించారని ఎస్వీప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం నుంచి ఈనెల13 లోపు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి కళాశాలలోని హెల్ప్‌లైన్ కేంద్రంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసుకోవాలని తెలిపారు. మొదటిదశ కౌన్సెలింగ్‌కి హాజరు కాని విద్యార్థులు కూడా సర్టిఫికెట్లను రీవెరిఫై చేసుకోవచ్చన్నారు. ఈనెల14 వరకు ఆప్షన్ల నమోదుకు అవకాశం ఉందన్నారు. 16న విద్యార్థులకు సీటు అలాట్‌మెంట్ ఉంటుందని వివరించారు.

సమగ్రశిక్షలో అంతర్గత ఆడిట్
వైసీపీ హయాంలో చెల్లింపులపై ఆరా

చిత్తూరు (సెంట్రల్), జూలై 10:చిత్తూరు జిల్లా సమగ్రశిక్షలో రాష్ట్ర స్థాయి ఆడిట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఫైనాన్స్ కంట్రోలర్ పాలేశ్వర్‌రావు, అకౌంట్స్ అధికారి ప్రసాదరావు నేతృత్వంలోని బృందం బుధవారం జిల్లా సమగ్రశిక్ష కార్యాలయానికి చేరుకుని ఆడిట్ చేపట్టారు. ఆర్థిక లావాదేవీలపై ఏపీసీ వెంకటరమణారెడ్డి, అకౌంట్స్ అధికారి నాగరాజరావులను విచారించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో నియమకాలు, అనుమతులపై లోతుగా విచారణ జరిపారు. సహిత విద్య, కేజీబీవీ, మానిటరింగ్, ట్రైనింగ్, ప్లానింగ్, నాడు-నేడు, ఇంజనీరింగ్ తదితర విభాగాల రికార్డులను పరిశీలించారు. కేజీబీవీ, సహిత విద్య నియామకాల్లో అనుసరించిన పద్ధతులను పరిశీలించారు.

ఆలస్యంగా నడిచిన రైళ్లు

తిరుపతి(సెంట్రల్),జూలై10: తిరుపతి,రేణిగుంట స్టేషన్ల మీదుగా బుధవారం పలు రైళ్ళు ఆలస్యంగా నడిచాయి. కేరళ ఎక్స్‌ప్రెస్ (12626-12625) రెండు గంటలకు పైగా ఆలస్యంగా నడిచింది. కన్యాకుమారి నుంచి ముంబాయికి వెళ్లే జయంతి ఎక్స్‌ప్రెస్(16382) రెండున్నర గంటలు, ముంబాయి- చెన్నై ఎక్స్‌ప్రెస్(22159) గంటన్నర ఆలస్యంగా నడిచాయి. హౌరా- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (22887) ఐదున్నర గంటలు, సెవెన్ హిల్స్ ఎక్స్‌ప్రెస్(12770)గంటన్నర పాటు ఆలస్యంగా నడిచాయి. దీంతో ప్రయాణికులు తాగునీటికి,అల్పాహారాలకోసం ఇబ్బంది పడ్డారు.

తిరుపతి-హిస్సార్ ప్రత్యేక రైలు వేళల్లో మార్పు

తిరుపతి-హిస్సార్ (రాజస్తాన్) మధ్య నడుస్తున్న వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు(04717-18) వేళల్లో మార్పులు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇక నుంచి హిస్సార్ నుంచి రైలు బయలుదేరి సోమవారం ఉదయం 9.55 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. తిరిగి అదేరోజు రాత్రి 11.45 గంటలకు తిరుపతిలో బయలుదేరనుంది.

సీఎంతో హేమాంబరధరరావు భేటీ



చంద్రగిరి, జూలై 10: చంద్రగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలూ పని చేశానని, నామినేటెడ్ పదవుల కేటాయింపులో తనకు తగిన గుర్తింపు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు విన్నవించారు. బుధవారం విజయవాడలో చంద్రబాబును హేమాంబరధరరావు కలిశారు. ఈ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కోసం తన కృషిని వివరించారు. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించారని హేమాంబరధరరావు తెలిపారు.

ఫిజియోథెరపీ సేవల సద్వినియోగం

తిరుపతిరూరల్, జూలై 10: భవిత కేంద్రాల్లో సమగ్రశిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సహిత విద్య జిల్లా కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలం ఎంఆర్‌పల్లె ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రాన్ని బుధవారం అయన సందర్శించారు. తల్లిదండ్రులతో మాట్లాడుతూ ఈ కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు ప్రతి బుధవారం ఫిజియోథెరపీ క్యాంప్ ఉంటుందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫిజియోథెరపిస్ట్ సరళకుమారి, సహిత టీచర్ ఉషారాణి, సీఆర్‌ఎంటీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.51 కోట్లు

తిరుమల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.51 కోట్లు లభించింది. సోమవారం ఉదయంనుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి, బుధవారం ప్రకటించింది. మంగళవారం 67,245 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 25,054 మంది తలనీలాలు సమర్పించారు.

అయోధ్యకాండ అఖండ పారాయణంతో

పులకించిన తిరుమల సప్తగిరులు



తిరుమల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నాదనీరాజనం వేదికపై బుధవారం ఉదయం జరిగిన అయోధ్యకాండ అఖండ పారాయణంతో తిరుమల సప్తగిరులు పులకించాయి. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమం భక్తులను భక్తిసాగరంలో ముంచెత్తింది. అయోధ్యకాండలోని 45 నుంచి 49వ సర్గ వరకు 141 శ్లోకాలు, యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు పారాయణం చేశారు. ధర్మగిరి వేదవిజ్ఞానపీఠం పండితులు రామానుజాచార్యులు, అనంతగోపాలకృష్ణ, మారుతి శ్లోక పారాయణం చేశారు. ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠం, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం అధ్యాపకులు, ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థకు చెందిన వేదపారాయణదారులు, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రపండితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు తేజోవతి బృందం కీర్తనలు ఆలపించారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

రామచంద్రాపురం, జూలై 10: ఆర్‌సీపురం మండల కేంద్రంలో తాగునీటి పైపులైన్ లీకేజీని అధికారులు బుధవారం అరికట్టారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన తాగునీటి పైపులైన్ లీకేజీతో తాగునీరు కలుషితం అనే వార్తకు అధికారులు స్పందించారు. లీకేజీ ఉన్న చోట జేసీబీతో తవ్వి పైపులైనుకు మరమ్మతులు చేపట్టారు.

తిరుమలలో కేంద్రమంత్రి బండి సంజయ్

తిరుమల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శ్రీవారి దర్శనార్థం బుధవారం తిరుమలకు వచ్చారు. సాయంత్రం తిరుమలలోని శ్రీకృష్ణ అతిథి గృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ అధికారులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికి బస, దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రాత్రి బండి సంజయ్ వరాహస్వామిని దర్శించుకుని వెంగమాంబ అన్నప్రసాద భవనంలో అన్నప్రసాదాలు స్వీకరించారు.కేంద్రమంత్రిని తిరుపతి బీజేపీ నాయకులు,న్యాయవాది వల్లంశెట్టి భవాని శంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎర్రచందనం,గంజాయి స్మగ్లింగ్ నివారణ కోసం కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్య సమాజం



చెత్త ఊడుస్తున్న ఎమ్మెల్యే నాని, కలెక్టర్ వెంకటేశ్వర్

మంగళం, జూలై 10: మంగళం ప్రాంతంలో నేరాల కట్టడికి త్వరలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే పులివర్తి నాని హామీ ఇచ్చారు. మంగళంలో బుధవారం పారిశుధ్యం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నానీతో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ పాల్గొని స్వయంగా చెత్తను శుభ్రం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాల నేపథ్యంలో నివాస ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలన్నారు. మంగళం ప్రజలకు తెలుగుగంగ నీటిని ఇవ్వడానికి చర్యలు చేపడతామన్నారు. ఈ ప్రాంతంలోని పేదలకు గత ప్రభుత్వం దూరంగా ఉండే చిందేపల్లిలో పట్టాలు ఇచ్చిందన్నారు. వారికి ఇక్కడే టిడ్కో ఇళ్లు కట్టివ్వడానికి సర్వే ట్రైనింగ్ అకాడమీ స్థలాన్ని కేటాయించాలన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తెలుగుగంగ నీటి సరఫరాకు, టిడ్కో ఇళ్ల నిర్మాణ ప్రక్రియకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వైద్యా ఆరోగ్యశాఖాధికారి శ్రీహరి, జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి, విద్యుత్‌శాఖ ఏఈ హరికృష్ణ, మంగళం పీహెచ్‌సీ వైద్యాధికారులు జయంతి, స్రవంతి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి అంగీకారం

జయశంకర్‌కాలనీలో జనసేన కార్యకర్త సాయి తల్లి సుజాతమ్మకు ఆరోగ్యం సరిగా లేదని పులివర్తి నాని వెళ్లి పరామర్శించారు. అర్చన అనే వికలాంగురాలికి పింఛను వచ్చేలా ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో తుడా అభ్యంతరం తెలిపిన గ్రామదేవత ఆలయ నిర్మాణ స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఆలయం నిర్మించుకోవచ్చునని భరోసా ఇచ్చారు. పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపీనాథ్, నాయకులు రామంజేరి మహేశ్వరి, అలిమినేని మధు, జడారెడ్డి భాస్కర్‌రెడ్డి, బాషా, గాజుల రమణ, సురేష్, సుబ్బుయాదవ్, నాగేంద్ర, సంతోష్, హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆ భూమి హథీరాంజీ మఠానిదే : ఫిట్‌పర్సన్

తిరుపతి రూరల్, జూలై 10: అవిలాల గ్రామ సర్వే నెంబరు 145లో 1.58సెంట్లు, 147/1లో 25.20సెంట్ల భూమి హథీరాంజీ మఠానికి చెందినదేనని, అక్కడ భూకబ్జాదారులదే హవా నడుస్తోందని, ఎమ్మెల్యే నానీకి ఎలాంటి సంబంధం లేదని మఠం ఫిట్‌పర్సన్ రమేష్ నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత నెల 9న ఆ భూమిని చదును చేస్తున్నారని సమాచారం అందగా తమ సిబ్బంది అక్కడికి వెళ్లారన్నారు. ఎం.నరసింహారెడ్డి, పి.లింగమూర్తి, సేతుమాధవన్ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయని గుర్తించామన్నారు. అడ్డగించినా వినకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. మరుసటి రోజు ప్రహరీగోడను నిర్మిస్తున్నారని తెలిసి అడ్డుపడగా తమ సిబ్బంది గంగాధర్, రవిచంద్రరెడ్డి, విజయ్‌కుమార్, మునిరాజులను ఓ గదిలో బంధించారన్నారు. దేవదాయశాఖ కమిషనర్ సూచన మేరకు పోలీసుల జోక్యంతో వారిని విడిపించారన్నారు. ఈ విషయాన్ని ఎస్పీకి తెలియజేసి పాత్రదారులపై కేసు నమోదు చేయాలని కోరామన్నారు. హద్దులు నిర్ణయించేవరకు ఆ భూమిలో ఎవరు ప్రవేశించకుండా ఉత్తర్వులు ఇవ్వాలని ఆర్డీవో, రూరల్ తహసీల్దార్‌ను కోరామన్నారు. ఆ తరువాత నరసింహారెడ్డి హైకోర్టును ఆశ్రయించగా గత నెల 26న ఆ భూమిని యథాతథంగా కొనసాగించాలని తీర్పు ఇచ్చిందన్నారు. నిబంధనల మేరకు సర్వే నిర్వహించి హద్దులను నిర్ణయించాలని ఆర్డీవో, తహసీల్దార్‌ను ఆదేశించిందన్నారు. ఆ భూమిపై సెక్షన్ 145 అమలులో ఉందన్నారు. దీనిని అతిక్రమిస్తే శిక్షార్హులవుతారన్నారు. ఓ ప్రత్రికలో వచ్చిన విధంగా ఎమ్మెల్యే నాని పాత్ర లేదని, ల్యాండ్‌మాఫియానే ఈ భూకబ్జాల్లో పాత్రధారులు, సూత్రధారులని రమేష్ నాయుడు స్పష్టం చేశారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న గీత

చంద్రగిరి పాఠశాల తనిఖీ

చంద్రగిరి, జూలై 10: చంద్రగిరిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, మండలంలోని మిట్టపాలెం ప్రాథమిక పాఠశాలను బడి బయట పిల్లల రాష్ట్ర సలహాదారులు, కౌన్సిల్ గీత బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు అందించిన కిట్స్ నాణ్యత, వాటి ఉపయోగాన్ని వారికి వివరించారు. మిట్టపాలెం ప్రాథమిక పాఠశాలలోని ఉపాధ్యాయులు తమ సొంత ఖర్చులతో ఆటో ఛార్జీలు వెచ్చించి ఐదుగురు బడి బయటి విద్యార్థులను పాఠశాలలో నమోదు చేయించారు. ఆ పిల్లలకు గీత చేతుల మీదుగా విద్యాసామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు సురేష్, శ్రీధర్, ఎంఈవోలు లలిత కుమారి, భాస్కర్ బాబు, హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి, సీఎంఆర్టీ శ్యామల, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న వైభవోత్సవాలు ప్రారంభం



పెద్ద శేష వాహనంపై కల్యాణ వెంకన్న

చంద్రగిరి, జూలై 10: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 10 నుంచి 11గంటల వరకు ఆలయ ముఖ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి పెద్దశేష వాహనంపై ఊరేగించారు. గురువారం హనుమంత వాహనంపై, శుక్రవారం గరుడ వాహనంపై స్వామివారు విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు. డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్ ఉద్యోగి ఇంట్లో చోరీ



దొంగతనం జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ

తిరుపతి(నేరవిభాగం), జూలై 10: తిరుపతి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని పేరూరులో బుధవారం పట్టపగలు దొంగలు పడ్డారు. ఎస్ఐ నాగేంద్ర కుమార్ కథనం మేరకు... పేరూరులో నివాసముండే వినోద్‌కుమార్ స్విమ్స్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. భార్య ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. కుమార్తె కళాశాలకు వెళ్లడంతో ఉదయం 9 గంటల ప్రాంతంలో అందరూ టిఫిన్ చేసుకుని ఇంటికి తాళాలు వేసి, తాళాలను స్కూటీలో పెట్టి వెళ్లారు. అయితే పట్టపగలు దీన్ని గమనించిన దుండగులు ఇంటి తాళాలు తీసుకుని, తలుపులు తెరచి బీరువాలో వున్న 18 గ్రాముల బంగారు నగలు అపహరించుకుని వెళ్లారు. సాయంత్రం ఇంటికి రాగా, తలుపులు తెరచి ఉండటంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూడగా వస్తువులన్నీ చిందర వందరగా పడి ఉండటం, బీరువాలోని బంగారు నగలు కనిపించక పోవడంతో వెంటనే ఎంఆర్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సీఐ అహ్మద్ నేతృత్వంలో ఎస్ఐ నాగేంద్రబాబు, సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇంటినుంచి వేలిముద్రలు సేకరించారు. బాధితుడు వినోద్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

అన్నప్రసాదాల్లో నాణ్యత పెరిగింది: టీటీడీ ఈవో

తిరుమల, జూలై 10 (ఆంధ్రజ్యోతి):ఇటీవల తీసుకున్న చర్యల వల్ల భక్తులకు మరింత రుచికరమైన అన్నప్రసాదాలు అందించగలుగుతున్నట్టు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాద భవనాన్ని జేఈవో వీరబ్రహ్మంతో కలిసి బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఈవో మీడియాతో మాట్లాడుతూ.. అన్నప్రసాద భవనంలో అధునాతమైన శాస్త్ర, సాంకేతిక పద్ధతిలో కూరగాయలు, ముడి సరుకుల నిల్వ, పారిశుధ్యం, ఆహార పదార్థాలను తనిఖీ చేసేందుకు నిపుణులైన అధికారులను నియమిస్తామన్నారు. అన్నం సరిగా ఉడకలేదనే ఫిర్యాదులు భక్తుల నుంచి ఉన్నాయని, త్వరలో ఆ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అన్నప్రసాద విభాగంలో త్వరలో సరిపడా సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శిల్పారామంలో చేనేత, హస్తకళల మేళా

తిరుచానూరు, జూలై 10: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో బుధవారం సంస్కృతి కల్చరల్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో చేనేత, హస్తకళా మేళా ప్రారంభమైంది. నెలరోజుల పాటు జరిగే ఈ మేళాలో వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన 27మంది కళాకారులు తమ ఉత్పత్తులను అమ్మకం కోసం అందుబాటులో ఉంచారని శిల్పారామం ఏఈవో ఖాదరవలి తెలిపారు. ఉదయం 11 నుంచి రాత్రి 8గంటల వరకు నగరవాసులు సందర్శించవచ్చని తెలిపారు. కలంకారీ చీరలు, మీరట్ చెప్పులు, భాగల్‌పూర్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్, ఖాదీ షర్ట్స్, కొండపల్లి బొమ్మలు, టవల్స్, కాటన్ షర్ట్స్, ఖాదీ టాప్, షోలాపూర్ చెప్పులు, ప్రింటెడ్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్ తదితర వస్తువులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంస్కృతి కల్చరల్ సొసైటీ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

నీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

తిరుమల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఎంబీసీ ఏరియాకు బుధవారం నీటి సరఫరా నిలిచిపోవడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. నారాయణగిరి పార్క్‌నుంచి రింగురోడ్డు మీదుగా శిలాతోరణం, బాటగంగమ్మ ఆలయం, ఆక్టోపస్ బిల్డింగ్ వరకు సర్వదర్శన క్యూలైన్ ఉన్న విషయం తెలిసిందే. ఇక్కడ శాశ్వత క్యూలైన్లు, నాలుగు ప్రాంతాల్లో ఫుడ్ కౌంటర్ ఏర్పాటు చేయాలని టీటీడీ నిర్ణయించింది. ఇందులో భాగంగా రెండురోజుల క్రితం నారాయణగిరి వద్ద పొక్లెయినర్ ద్వారా తవ్వకాలు జరిపిన క్రమంలో నీటి పైప్‌లైన్ పగిలిపోయింది. తాత్కాలిక మరమ్మతులు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు. బుధవారం సాయంత్రం నూతన పైప్‌లైన్ ఏర్పాటుచేసేందుకు పనులు ప్రారంభించిన క్రమంలో దాదాపు రెండు గంటల పాటు నీటి సరఫరా ఎంబీసీ ఏరియాకు ఆగిపోయింది. దీంతో ఎంబీసీ ఏరియాలోని కాటేజీల్లో బస చేసే భక్తులు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు.అధికారులు వేగంగా పనులు చేపట్టడంతో తర్వాత నీరు యథావిధిగా కాటేజీలకు సరఫరా అయ్యింది.

స్వప్న వారాహిగా అమ్మవారు



రామచంద్రాపురం, జూలై 10: రాయలచెరువు కట్ట వారాహి నవరాత్రి ఉత్సవాల్లో బుధవారం అమ్మవారు స్వప్న వారాహిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో అమ్మవారికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం వేదపండితులు వేద మంత్రోచ్ఛరణల మధ్య వారాహి హోమాన్ని ప్రారంభించగా, కుర్తాలం పీఠాధిపతి సిద్ధేశ్వరానందభారతి, శక్తీ పీఠాధీశ్వరి రమ్యానందాభారతి హోమాన్ని పూర్ణాహుతితో ముగించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం అమ్మవారి ఊంజల్‌సేవ నేత్రపర్వంగా సాగింది. భక్తులకు రమ్యానందభారతి తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాలనుంచి భారీ ఎత్తున భక్తులు తరలి వచ్చారు.

హాస్టళ్ల తనిఖీ

చంద్రగిరి, జూలై 10: చంద్రగిరి మండలం, కొటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బొల్లినేని కుసుమ మండలంలోని 8 హాస్టళ్లను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు, వర్షాల కారణంగా అతిసార వ్యాధులు వ్యాపిస్తున్నాయని, తగినజాగ్రత్తలు తీసుకోవాలని, హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని విద్యార్థులకు, సిబ్బందికి సూచించారు. సిబ్బంది శ్యామల, వాసుదేవ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎస్వీయూ రిటైర్డు ప్రొఫెసర్ కన్నుమూత



ప్రొఫెసర్ జయసింహులు నాయుడు (ఫైల్ ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 10: ఎస్వీయూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగ రిటైర్డు ప్రొఫెసర్ వల్లేరు జయసింహులు నాయుడు (76) అనారోగ్యంతో మృతి చెందారు. నెల రోజులుగా ఊపిరితిత్తుల సంబంధ జబ్బుతో బాధపడుతూ వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి కన్నుమూశారు.చిత్తూరు జిల్లా బంగారుపాళ్యానికి చెందిన జయసింహులు ఎస్వీయూనివర్సిటీలో సుదీర్ఘ కాలం ప్రొఫెసర్‌గా పనిచేశారు. ప్రపంచ బ్యాంకు సౌజన్యంతో ప్రతిష్ఠాత్మక పరిశోధనా ప్రాజెక్టులు నిర్వహించారు. హ్యూమన్ రైట్స్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాన్ని స్థాపించారు. సీఎం చంద్రబాబు కు సన్నిహితుడైన జయసింహులు సతీమణి పార్వతి మహిళా వర్సిటీ ఉమెన్ స్టడీస్ విభాగంలో ప్రొఫెసర్‌గా, ఆ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా పనిచేశారు. వీరి కుమార్తె అమెరికాలో స్థిర పడ్డారు. ప్రొఫెసర్ జయసింహులు మృతికి ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఛైర్మెన్ పొంద్ర సురేంద్ర నాయుడు, నందనం అకాడమీ డైరెక్టర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్‌గౌడ్ సంతాపాన్ని వ్యక్తం చేశారు. జయసింహులు నాయుడు భౌతిక కాయానికి గురువారం మధ్యాహ్నం గోవింద ధామంలో అంత్యక్రియలు నిర్వహిస్తారు.

సీఎం చంద్రబాబు సంతాపం

జయసింహులు మృతికి సీఎం చంద్రబాబు సంతాపాన్ని వ్యక్తం చేశారు. యూనివర్సిటీలో చదువుకునే రోజుల్లో జయసింహులుతో ఎంతో అనుబంధం ఉండేదన్నారు. ఎంతో మంది విద్యార్థులను ఆయన గొప్పగా తీర్చిదిద్దారని ఒక ప్రకటనలో నివాళులర్పించారు. తన రచనలు, ప్రసంగాల ద్వారా అనేక మందికి మార్గదర్శిగా నిలిచారని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



వైసీపీ శ్రేణులకే అత్యధికంగా పంపిణీ

నిబంధనలను పట్టించుకోని అధికారులు

ఒకే ఇంట్లో రూ.2 కోట్ల పంట రుణాలు

ఉద్యోగ నియామకాల్లోనూ చేతివాటం

ఐదేళ్లలో గాడి తప్పిన పాలన

ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లా సహకార కేంద్రబ్యాంకు (డీసీసీబీ) గాడితప్పింది. పాలకవర్గం, అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. రుణాల మంజూరులో వైసీపీ శ్రేణులకే పెద్దపీట వేశారు. కమీషన్లకూ తెరతీశారు. ఉద్యోగ నియామకాల్లోనూ డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. వీటిపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

\- చిత్తూరు కలెక్టరేట్

డీసీసీబీలో దా'రుణాలు'!

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించిన డీసీసీబీలో అవకతవకలు చోటు చేసుకున్నా అడిగే వాళ్లు లేకుండా పోయారు. నిబంధనలకు విరుద్ధంగా రుణాలు మంజూరు చేయడం, తద్వారా కమీషన్లు పొందేవారన్న విమర్శలున్నాయి ఐదేళ్లుగా సింగిల్ విండోలకు ఎన్నికలు జరగకపోవడం, నామినేటెడ్ కమిటీల నియామకంతో సెవెన్‌మెన్ పాలకవర్గం పలుచబడింది. నాటి మంత్రి పెద్దిరెడ్డి ఆశీస్సులతో ఐదేళ్లుగా బ్యాంకు ఛైర్‌పర్సన్‌గా రెడ్డమ్మ ఉన్నా.. ఆమె భర్త, వైసీపీ నేత కృష్ణమూర్తి హవానే నడిచింది. మీటింగుల్లో ఆయన కూడా కూర్చోవడం, అధికారులకు ఆదేశాలు జారీ చేసేవారు. అధికారులూ ఆయన ఆదేశాలను పాటించేవారు. ఇక, ఇక్కడి కొందరు డైరెక్టర్లు.. బ్యాంకు అధికారులతో కలిసి రుణాలకు సంబంధించిన ప్రతి ఫైలుకూ 10శాతం వసూలుచేసి మంజూరు చేసేవారన్న విమర్శలున్నాయి. లేకుంటే కుంటి సాకులు చెబుతూ బ్యాంకు చుట్టూ తిప్పించుకునే వారని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఇలా కమీషన్ల పేరిటే రూ.లక్షల్లో వసూలు చేశారన్న విమర్శలున్నాయి. ఎక్కువగా పుత్తూరు, నగరి, శ్రీకాళహస్తి, తిరుపతి, పిచ్చాటూరు బ్యాంకు బ్రాంచుల పరిధిలోని రైతులు ఇబ్బంది పడినట్లు తెలుస్తోంది.

రుణాలన్నీ వైసీపీ శ్రేణులకే..

వి.కోట, మదనపల్లె, పలమనేరు, బైరెడ్డిపల్లె, పుంగనూరు తదితర బ్యాంకు బ్రాంచుల్లో వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలు రూ.40 లక్షలకు మించి నిబంధనలకు విరుద్ధంగా మంజూరు చేశారు. వీటిలో 90 శాతం వరకు వైసీపీ నాయకులు, కార్యకర్తలకే సరైన రికార్డులు లేకున్నా ఇచ్చేశారని సమాచారం. ఓ కుటుంబంలో ఒకరికే రుణం ఇవ్వాల్సి ఉంది. వి.కోటలో మాత్రం ఒకే ఇంట్లోని ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.40 లక్షల చొప్పున రూ.రెండు కోట్లు మంజూరు చేయడం గమనార్హం. ఇలా పలు బ్యాంకు శాఖల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మంత్రి పెద్దిరెడ్డి, వైసీపీ నేత కృష్ణమూర్తి ఆదేశాలతో ఇదంతా జరిగినట్లు బ్యాంకు వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అప్పటి మంత్రుల అండదండలతో పాలకవర్గ సభ్యులు వారి బంధువుల పేర్లతో రికార్డులు లేకుండా రూ.10 కోట్ల మేర రుణాలు తీసుకున్నారు. ఒక్క పైసా కూడా ఎవరూ చెల్లించలేదు.

ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు

డీసీసీబీ విస్తరణలో భాగంగా 2022లో నియామకాల్లో జరిగిన అక్రమాలపై బాధితులు గగ్గోలు పెడుతున్నారు. ఉద్యోగ నియామకాల్లో సొసైటీ ఉద్యోగులకు 25 శాతం కేటాయించాలి. ఆ మేరకు మంజూరైన 50 పోస్టుల్లో 12 ఉద్యోగాలు సొసైటీ ఉద్యోగులకు కల్పించారు. ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షల మేర వసూలు చేసినట్లు ప్రచారం జరిగింది. ఈ మొత్తాన్ని అధికారులు, పాలకవర్గం 50.. 25.. 25.. శాతాల చొప్పున పంచుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఉద్యోగ అవకాశాలు ఇస్తామని మరి కొందరు సొసైటీ ఉద్యోగుల నుంచీ కొంత మొత్తాన్ని వసూలు చేసి ఉద్యోగాలు ఇవ్వలేదు. దీంతో బాధితులు పాలకవర్గం, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. పైసా కూడా తిరిగివ్వలేదు. ఏవో కారణాలతో టెర్మినేట్, సస్పెండ్ చేసిన ఉద్యోగుల నుంచీ భారీ మొత్తాల్లో తీసుకుని తిరిగి ఉద్యోగాలు ఇచ్చినట్లు సమాచారం.

అటెండర్, వాచ్‌మెన్ నియామకాల్లో గోల్‌మాల్

బ్యాంకు పరిధిలో 40 బ్రాంచులు ఉండగా, వాటిలో 150 మంది అటెండర్లు, వాచ్‌మెన్ పని చేస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ కింద హైదరాబాద్‌కు చెందిన గాయత్రి సెక్యూరిటీ ఏజెన్సీ ద్వారా వీరిని తీసుకున్నారు. గతంలో 10 మందిని అటెండర్లు, వాచ్‌మెన్‌గా తీసుకోగా, వారిలో 8 మంది మాత్రమే పనిచేస్తున్నారు. జీతాలు మాత్రం పది మందికీ మంజూరు చేస్తున్నట్లు తెలిసింది. ఆ ఇద్దరి జీతాలు కొందరి జేబుల్లోకి వెళ్తున్నట్లు తెలిసింది. ఇలా ఏజెన్సీ ద్వారా జరిగిన నియామకాలు.. ఇప్పుడు పనిచేస్తున్న వారు.. చెల్లిస్తున్న జీతాలపై సమగ్ర విచారణ చేపడితే అసలు అక్రమాలు బయటపడతాయి.

ఓటీఎస్, అమూల్ రుణాల పేరిట అక్రమార్జన

వాయిదా మీరిన అన్నిరకాల రుణాలు మాఫీ చేస్తామని, ఓటీఎస్ పథకం పేరిట మేలు చేస్తామని కొందరు డైరెక్టర్లు, రైతులనుంచి కమీషన్లు వసూలు చేసినట్లు తెలిసింది. కొన్ని బ్యాంకు శాఖల ద్వారా వైసీపీ శ్రేణులు దొంగ పేర్లతో పాడి పశువులు కొన్నట్లు చూపి.. అమూల్ రుణాలు పొందారు. పెద్దిరెడ్డి ఆదేశాలతో డీసీసీబీ నుంచే వీరికి రూ.20 కోట్ల రుణాలిచ్చినట్లు తెలిసింది. వీటిపైనా సమగ్ర విచారణ జరిపిస్తే నిధులు స్వాహా ఏ మేరకు జరిగాయో బయటపడుతుంది.

రెండోసారీ ఆయనే సీఈవో

సాధారణంగా ప్రతి మూడేళ్లకు బ్యాంకు సీఈవోను మార్చాలి. అలా కాకుండా పాలకవర్గం తమకు అనుకూలంగా ఉన్నారనే ఉద్దేశంతో మనోహర్‌గౌడ్‌ను సీఈవోగా రెండోసారి కూడా కొనసాగించారు. 'పెద్దిరెడ్డి చెప్పారు..' అంటూ డీసీసీబీలో ఎవరికి వారు అక్రమాలకు తెర తీశారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి.. ఐదేళ్లుగా డీసీసీబీలో జరిగిన తంతుపై విచారణ జరిపించాలని రైతులు డిమాండు చేస్తున్నారు.

రుయాలో మరో మూడు డయేరియా కేసులు

● పాస్ మనోవికాస్ కేంద్రంలో 19కి చేరిన బాధితులు

తిరుపతి(వైద్యం), జూలై 10: పద్మావతిపురంలోని పాస్ మనోవికాస్ మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమంలో డయేరియా లక్షణాలతో బాధపడుతున్న మరో ముగ్గురు దివ్యాంగులను బుధవారం ఆశ్రమ నిర్వాహకులు రుయాస్పత్రికి తీసుకువచ్చారు. దీంతో బాధితుల సంఖ్య 19కి చేరింది. మంగళవారం కలుషిత ఆహారం తిని ఇద్దరు మృతి చెందగా 16 మంది డయేరియా లక్షణాలతో రుయాస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. రుయాస్పత్రికి తీసుకువచ్చిన ముగ్గురిలో శ్రీతేజ(24), రంగమ్మ(28)లతో పాటు వికాస్(11) అనే బాలుడు ఉన్నాడు. శ్రీతేజ, రంగమ్మలను ఏఎంసీలో వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. వికాస్ కోలుకోవడంతో డిశ్చార్జి చేశారు. కోలుకున్న వారిని డిశ్చార్జి చేయగా 8 మంది రుయాలో చికిత్స పొందుతున్నారు.



రుయాలో చికిత్స పొందుతున్న శ్రీతేజ, రంగమ్మ



పాస్ మనోవికాస్‌లో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పులివర్తి

పాస్ మనోవికాస్‌ను సందర్శించిన ఎమ్మెల్యే నాని

తిరుచానూరు, జూలై 10: పద్మావతిపురంలోని మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమాన్ని(పాస్ మనోవికాస్) ఎమ్మెల్యే పులివర్తి నాని బుధవారం సందర్శించారు. మూడు రోజుల క్రితం డయేరియాతో ఇద్దరు మృతి చెందడం.. మరి కొంతమంది అస్వస్థతలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడి పరిస్థితులపై నాని ఆరా తీశారు. మిగిలిన వారు డయేరియా బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు తరచూ సందర్శించాలన్నారు. తాగునీరు, ఆహారం కలుషితం కాకుండా చూడాలన్నారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఆశ్రమ పరిసరాలను శుభ్రంగా ఉండాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవసరమున్నా తనను సంప్రదించాలని ఆయన సూచించారు. ఆయన వెంట జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి, పంచాయతీ కార్యదర్శి శివశంకర్ రాజు, టీడీపీ నేతలు ఈశ్వరరెడ్డి, అమిలినేని మధు, వాణీ గౌడ్, సు బ్రహ్మణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీనా.. అయితే మళ్లీ రండి

రోజుల తరబడి రోగుల నిరీక్షణ ● నగదు చెల్లింపు వైద్య సేవలకే స్విమ్స్‌లో ప్రాధాన్యత

తిరుపతి(వైద్యం), జూలై 10: స్విమ్స్‌లో ఆరోగ్యశ్రీ రోగులకు రోజుల తరబడి నిరీక్షణ తప్పా వైద్య సేవలు అందుతున్న దాఖలాలు అంతంత మాత్రంగా ఉన్నాయి. అత్యవసర వైద్యం కోసం వచ్చినా ఆరోగ్యశ్రీ అనగానే బయటి నుంచే పంపేస్తున్నారు. ఈక్రమంలోనే చిట్వేలు మండలం చెర్లోపల్లికి చెందిన నారాయణమ్మ న్యూరో సర్జరీ సమస్యతో బాధ పడుతుండటంతో కుటుంబ సభ్యులు స్విమ్స్ అత్యవసర విభాగానికి తీసుకువచ్చారు. అక్కడ వైద్యులు తిరిగి పంపేయడంతో ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించడంతో ఈ నెల 6న మళ్లీ స్విమ్స్ అత్యవసర విభాగానికి తీసుకువచ్చారు. అక్కడి వైద్యులు వచ్చి హెల్త్ ఇన్సూరెన్సుపై ఆరా తీశారు. లేకపోతే నగదు చెల్లించాల్సి వస్తుందని చెప్పారు. నగదు చెల్లించే స్థోమత లేదని, ఆరోగ్యశ్రీ మాత్రమే ఉందని చెప్పారు. దీంతో నారాయణమ్మతో కుటుంబ సభ్యులు రోజంతా స్విమ్స్ అక్కడే నిరీక్షించాల్సి వచ్చింది. సాయంత్రానికి వైద్యులు వచ్చి ఆరోగ్యశ్రీలో అత్యవసర విభాగంలో చేర్చుకోవడం కుదరదన్నారు. సోమవారం సాధారణ ఓపీకి రావాలని సూచించారు. దీంతో సోమవారం ఓపీకి తీసుకువచ్చారు. అక్కడ రోగి పరిస్థితి విషమగా ఉందని అత్యవసర విభాగానికి వెళ్లండంటూ సూచించారు. అక్కడ మళ్లీ అదే పరిస్థితి ఎదురైంది. ఇలా రోజూ వందల మందికి స్విమ్స్‌లో ఇలాంటి అనుభవాలు ఎదురవుతున్నాయి. హెల్త్ ఇన్సూరెన్స్, నగదు చెల్లించే వారికి మాత్రమే స్విమ్స్‌లో ప్రాధాన్యతనిస్తున్నారని రోగులు వాపోతున్నారు. ఆరోగ్యశ్రీ కింద వచ్చే పేద రోగులు రోజుల తరబడి తిరిగినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



ఈనెల 6న స్విమ్స్ అత్యవసర విభాగం ముందు కారులో నిరీక్షిస్తున్న బాధితురాలు నారాయణమ్మ - బుధవారం ఓపీ కేంద్రం ముందు బాధితురాలితో సహాయకులు

భూసేకరణ సమస్యలు పరిష్కరించండి

● రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), జూలై 10: రైల్వేలైన్, పరిశ్రమలకు సంబంధించి భూసేకరణ పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం రెవెన్యూ, పరిశ్రమల శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్, ఏపీఐఐసీలో పెండింగ్‌లో ఉన్న సీబీఐసీ, వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, ఇనగలూరు అపాచీ అంతర్గత పనులు, తదితర భూసంబంధిత అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, డీఆర్వో కిషోర్, ఆర్డీవోలు నిషాంత్‌రెడ్డి, కిరణ్‌కుమార్, రవిశంకర్ రెడ్డి, ఏపీఐఐసీ ఎస్డీసీ నరసింహులు, అధికారులు చంద్రశేఖర్, విజయరత్నం, కలెక్టరేట్ అధికారులు, సంబంధిత తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ సిబ్బంది నిజాయితీ

●పోగొట్టుకున్న ఆభరణాలు భక్తుడికి అప్పగింత



తిరుపతి అర్బన్, జూలై 10: వసతి గదిలో మరచిపోయిన బంగారు ఆభరణాలను భక్తులకు తిరిగి అప్పగించి టీటీడీ సిబ్బంది నిజాయితీ చాటుకున్నారు. శ్రీవారి దర్శనార్థం ఒంగోలుకు చెందిన పి.వెంకటపవన్ కుటుంబ సభ్యులతో మంగళవారం తిరుపతి వచ్చారు. శ్రీనివాసంలో రూం తీసుకున్నారు. బుధవారం ఉదయం హడావిడిలో రెండు పొడవైన బంగారు చైన్లను ఆ రూంలో మరిచిపోయారు. తర్వాత శుభ్రం చేయడానికి వెళ్లిన సిబ్బంది ఈ ఆభరణాన్ని గుర్తించి శ్రీనివాసం అధికారులు కృష్ణప్రసాద్, శ్రీనివాసులకు అప్పగించారు. వారి సమాచారంతో తిరుమల నుంచి వెంకటపవన్ వెంటనే శ్రీనివాసం చేరుకున్నారు. సుమారు రూ. 5లక్షల విలువైన ఆభరణాలను తీసుకుని ఆనందపడ్డారు. అక్కడి పారిశుధ్య కార్మికులకు, టీటీడీ ఉద్యోగుల నిజాయితీని ప్రశంసించారు.

కలెక్టరేట్ వద్ద డ్రైవర్ల ఆందోళన



తిరుపతి (కలెక్టరేట్), జూలై 10: కేంద్రం కొత్తగా తీసుకువచ్చిన క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆటో, ఇతర వాహన డ్రైవర్లు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కొత్త చట్టంలో సెక్షన్ 106(1, 2) ప్రమాదకరమైందన్నారు. దీని వల్ల డ్రైవరు ఉనికే ప్రమాదరంగా మారుతుందన్నారు. తక్షణం దీన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లా కమిషన్‌తో సంప్రదించకుండా చట్టం చేయడం సరికాదన్నారు. పార్లమెంటులో సవివరంగా చర్చ జరగకుండా ఆమోదింప చేసుకున్నారన్నారు. ఈ విధంగా ఆమోదముద్ర వేయడం డ్రైవర్ల గొంతు కోయడమేనని దుయ్యబట్టారు. మాధవ్, వేణుగోపాల్, రమణయ్య, తంజావూరు మురళి, బుజ్జి, వాసు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 10: స్విమ్స్ ఆధ్వర్యంలో బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ద్వారా వివిధ పీహెచ్‌సీల పరిధిలో పింక్ బస్ క్యాంపుల్లో ఉచితంగా నిర్వహించే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ కోరారు. తిరుపతి కలెక్టరేట్‌లో బుధవారం క్యాన్సర్ స్క్రీనింగ్‌పై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను వీలైనంత త్వరగా గుర్తిస్తే తగిన వైద్యం అందించి పూర్తిగా నివారించవచ్చన్నారు. జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ జరుగుతుందన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, స్విమ్స్ బయో ప్రత్యేకాధికారి డాక్టర్ జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

టైం స్కేల్ ఉద్యోగి గుండెపోటుతో మృతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 10: ఎస్వీయూ ఎంసీఏ విభాగంలో జూనియర్ అసిస్టెంట్ వెంకటరమణ (56) అనారోగ్యంతో మృతి చెందారు. చంద్రగిరికి చెందిన వెంకటరమణ బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన మృతి పట్ల టైం స్కేల్ ఉద్యోగ సంఘం అధ్యక్షులు ఎర్రసాని సుబ్రమణ్యంరెడ్డి సంతాపం తెలిపారు. బాధిత కుటుంబంలో ఒకరికి టైంస్కేల్ ఉద్యోగం ఇవ్వాలని అధికారులను ఆయన కోరారు.

తిరుమల-తిరుపతి అభివృద్ధి పనులపై విచారణ

బీజేపీ నేత భానుప్రకాష్ రెడ్డి డిమాండ్



మాట్లాడుతున్న భానుప్రకాష్ రెడ్డి

తిరుపతి,(ఆటోనగర్), జూలై 10: తిరుపతి-తిరుమలలో గత ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ నాయకులు.భానుప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ భూమన కరుణాకర్‌రెడ్డి పాలించిన ఐదేళ్ల పాలనలో తిరుమల, తిరుపతిలో జరిగిన అభివృద్ధి పనులపై సమగ్ర విచారణ జరగాలన్నారు. ఆయన తనయుడు అభినయ్‌రెడ్డి నగర పాలక సంస్థలో సాగించిన అభివృద్ధి పనులపై కూడా సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. విచారణకు తమ పార్టీ సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. మేయర్ ఉన్నా అభినయ్ అన్నీ తానై వ్యవహరించారన్నారు. తుప్పుపట్టిన వాహనాలు మొదలు ఇంజనీరింగ్ విభాగంలో కమీషన్లు, రూ.100 కోట్ల టీడీఆర్ బాండ్లు, అటెండర్ ఉద్యోగాలు, పారిశుధ్యం విభాగంలో అవకతవకలు లాంటి అవినీతి పనులపై సమగ్ర విచారణ జరిపిస్తామన్నారు. తిరుమల-తిరుపతిల్లో దోచిన అవినీతి సొమ్మును తాడేపల్లికి తరలించారని ఆయన ఆరోపించారు. అవినీతికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించే వరకు తమ పార్టీ పోరాడుతుందన్నారు. రూ.25కోట్లతో కొనుగోలు చేసిన డబుల్ డెక్కర్ బస్సులో కూడా లక్షల రూపాయల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. స్మార్ట్‌సిటీ నిధులను కొల్లగొట్టిన వివరాలను సేకరిస్తున్నామన్నారు. నాయకులు అజయ్‌కుమార్, పొనగంటి భాస్కర్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో బెల్టు షాపుల జోరు

తిరుపతి(నేరవిభాగం), జూలై 10: జిల్లా వ్యాప్తంగా బెల్టు షాపుల వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా వికసిల్లుతోంది. తిరుపతి రూరల్ పరిధిలోని పేరూరు, అగరాల, కొటాల, రంగంపేట, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట, గూడూరు, చంద్రగిరి ప్రాంతాల్లో నాటు సారా కొంతమేర కట్టడి చేసినా మిగిలిన 263 ప్రాంతాల్లో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. అధిక ధరలకు అమ్ముతూ ఎక్సైజ్ శాఖకు సవాల్ విసురుతున్నారు. నెలసరి మామూళ్లు అందుతుండడంతో ఎక్సైజ్ అధికారులు వారు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. చంద్రగిరి, నాయుడుపేట, శ్రీకాళహస్తి, తిరుపతి రూరల్ ప్రాంతాల్లో అనుమతులూ లేవు సరికదా సమయపాలన కూడా లేదు. మద్యం షాపుల కంటే క్వార్టర్ బాటిల్ రూ.20 నుంచి రూ.25 ఎక్కువగా వసూలు చేస్తున్నా అందుబాటులో ఉండటంతో మందుబాబులు విచ్చలవిడిగా తాగుతున్నారు.

వైన్ షాపుల నుంచి మద్యం కొనుగోలు

సమీపంలోని ప్రభుత్వ మద్యం షాపుల నుంచి బెల్టు షాపుల వారు ఎంఆర్‌పీ ధరలకు మద్యం కొంటున్నారు. చీప్ లిక్కర్ ఎక్కువగా అందుబాటులో ఉంచి తక్కువ ధరకు విక్రయిస్తుండటంతో గిరాకీ ఎక్కువగా వుంది. క్వార్టర్ బాటిల్‌పై రూ.30 లభిస్తుండటంతో బెల్టు షాపుల నిర్వాహకులు కూడా వీటినే ఎక్కువగా కొనుగోలు చేసి అధిక లాభాలు గడిస్తున్నారు. షాపునుంచి నెలకు రూ.5వేల వంతున ఎక్సైజ్ అధికారులకు ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలున్నాయి.

డాక్టరేట్ ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 10: ఎస్వీయూ తెలుగు పరిశోధకుడు పూలరాతి నర్సప్ప డాక్టరేట్ పొందారు. కర్నూలు జిల్లా రైతు కథలు - అనుశీలన అంశంపై రిటైర్డు ప్రొఫెసర్ పేట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

నేడు నాన్ టీచింగ్ అసోసియేషన్ ఎన్నికలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 10: ఎస్వీ యూనివర్సిటీ నాన్ టీచింగ్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఎన్నికలు నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటల నుంచీ కౌంటింగ్ చేపడతారు. ఎన్నికల కారణంగా యూనివర్సిటీలో నాన్ టీచింగ్ ఉద్యోగులకు ఉదయం 8 నుంచీ మధ్యాహ్నం 2 గంటల వరకూ పనివేళలుగా నిర్ణయించారు.

విద్యాసామగ్రి పంపిణీ



తిరుపతి(విద్య), జూలై 10: తంబువానిగుంట నగర పాలక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హెల్పింగ్ టు అదర్స్ (హెచ్‌టూవో) సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, ఎరేజర్స్‌ని అందించారు. సంస్థ ప్రతినిధులు మణికంఠ, శ్రీనివాసులు, రఘునాథ, పావని, ప్రాథమిక, ఉన్నతపాఠశాలల హెచ్‌ఎంలు కె.రఘునాథ్, సుజాత, టీచర్లు పాల్గొన్నారు.

గంజాయిపై సెబ్, పోలీసుల నిఘా

తిరుపతి(నేరవిభాగం), జూలై 10:నగరంలో గంజాయి తాగుతున్న వారిపై పోలీసులు, సెబ్ అధికారులు బుధవారం ఉక్కుపాదం మోపారు. కొద్ది రోజులుగా కొన్ని ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేస్తోంది. మంగళవారం సాయంత్రం ఇద్దరు యువకులు గంజాయి తాగి తమ ఇళ్ల ముందు కూర్చోడాన్ని స్థానికులు గమనించారు. వారు గట్టిగా అడగడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు. మళ్లీ అదే రోజు రాత్రి కొందరు యువకులు రావడంతో అక్కడివారు నిలదీశారు. వెంటనే యువకులు పరారయ్యారు. దీంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం సాయంత్రం సెబ్ ఎస్‌ఐ స్వామినాథన్, సిబ్బంది, బ్లూకోల్ట్స్ ఆప్రాంతానికి వచ్చారు. గట్టి నిఘా పెడతామని వారు స్థానికులకు భరోసా ఇచ్చారు.

ముఖ్యమంత్రిని కలిసిన రాస్ ప్రధాన కార్యదర్శి



తిరుపతి(ఆటోనగర్), జూలై 10: ముఖ్యమంత్రి చంద్రబాబును బుధవారం అమరావతిలో రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం నాయుడు, డైరెక్టర్ వి.నాగరాజు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కూటమి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తా

● ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



ఎమ్మెల్యే ఆరణిని సత్కరిస్తున్న నాయకులు

తిరుపతి, జూలై10(ఆంధ్రజ్యోతి): పవన్ కల్యాణ్, చంద్రబాబు, మోదీ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. ఆధ్యాత్మిక నగరంలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పుతామన్నారు. 35,42,43,44 డివిజన్లలో ఎన్డీఏ కూటమి నేతలకు కృతజ్ఞతా సమావేశం టీడీపీ క్లస్టర్ ఇంచార్జి ఆర్సీ మునికృష్ణ ఆధ్వర్యంలో సప్తగిరినగర్‌లోని కమ్మ సంఘం సమావేశమందిరంలో బుధవారం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ భారీ మెజారిటీ కట్టబెట్టిన నగరప్రజలకు రుణపడి ఉంటానన్నారు. డివిజన్ స్థాయిలో ఎన్నికల్లో కష్టపడ్డ వారికే నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించనున్నట్లు చెప్పారు. అర్హులైన అందరికీ రేషన్ కార్డులు అందిస్తామన్నారు. 2,3,4,12డివిజన్లు, శెట్టిపల్లి ప్రాంతానికి చెందిన కృతజ్ఞతా సమావేశం లక్ష్మీపురం సర్కిల్‌లోని ఒక హోటల్‌లో టీడీపీ క్లస్టర్ ఇంచార్జి కృష్ణ యాదవ్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, నాయకులు శ్రీధర్ వర్మ, మహేష్ యాదవ్, రాజారెడ్డి, ఆకేపాటి సుభాషిణి, పోటుకూరి ఆనంద్, పొనగంటి భాస్కర్, నాగభూషణం, రాజేష్ ఆచారి, బాబ్జీ, చల్లా సెల్వం, సుబ్బు యాదవ్, కొండ రాజ్ మోహన్, బాలమురళీ, రామక్రిష్ణ, సుబ్బు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ అభివృద్ధికి తోడ్పడండి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 10: ఎస్వీయూనివర్సిటీ అభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌గౌడ్ కోరారు. బుధవారం యూనివర్సిటీలో నిర్వహించిన ఓ అధికారిక కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఎమ్మెల్యే ఆరణిని ఆనంద్‌గౌడ్ కలిసి పలు విషయాలు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే ఆరణి, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణను సన్మానించారు.నాయకులు పాకనాటి హరికృష్ణయాదవ్, పత్తిపాటి వివేక్ చౌదరి, బాలయ్య, మధుకర్, చంద్, రమణ, బషీర్, అశోక్, భీష్మ పాల్గొన్నారు.

శివరంజనికి ఎంఎల్ ఖురానా బెస్ట్ పేపర్ అవార్డు

తిరుపతి(వైద్యం), జూలై 10: స్విమ్స్‌లో బయో-ఇన్ఫార్మాటిక్స్‌లో పీహెచ్‌డీ చేస్తున్న పి.శివరంజని బెస్ట్ పేపర్ అవార్డు అందుకోవడం అభినందనీయమని వైద్యసంస్థ డైరెక్టర్ ఆర్వీకుమార్ తెలిపారు. బుధవారం ఆయన ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బయోఇన్ఫార్మాటిక్స్ విభాగాధిపతి ఉమామహేశ్వరి నేతృత్వంలో పీహెచ్‌డీ చేస్తున్న శివరంజని ఈ నెల 5 నుంచి7 వరకు హైదరాబాద్‌లో ఫార్మాసూటికల్ అసోసియేషన్ నిర్వహించిన ఇండియన్ ఫార్మాసూటికల్ కాంగ్రెస్‌లో పాల్గొందన్నారు. ప్రొఫెసర్ ఎంఎల్ ఖురానా ఐజేపీఎస్ ఉత్తమ పేపర్ అవార్డుతోపాటు రూ. 10 వేల నగదు ప్రోత్సాహక అవార్డును కూడా అందుకున్నట్లు వివరించారు.

వివాహిత ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), జూలై 10: తిరుపతిలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. అలిపిరి ఇన్‌చార్జి సీఐ జయనాయక్ కథనం మేరకు... ఒడిశాలోని బడిగూడకు చెందిన మిట్టాసెబాల్ ఏడాదిన్నర క్రితం తిరుపతి వలస వచ్చింది. ఈక్రమంలో రాయగడ జిల్లా ఒరిస్సాకు చెందిన బాబూరావుతో పరిచయమేర్పడింది. దీంతో రాజీవ్‌కాలనీలో అతనితో సహజీవనం చేస్తోంది. తర్వాత వీరు మాధవనగర్‌కు మారారు. ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం. కొంత కాలంగా మిట్టాసెబాల్ మానసిక స్థితి సరిగా లేదు. తరచూ వీరి మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈనేపథ్యంలో గతంలో రెండు సార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మంగళవారం కూడా గొడవపడి ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త బాబూరావు ఇంటికి వచ్చి చూసే సరికి విగతజీవిగా పడి ఉంది. దీంతో అతడు భయాందోళనతో మృతదేహాన్ని సమీపంలోని ముళ్లపొదల్లో పడేశాడు. ఈ విషయాన్ని హెడ్ మేస్త్రీ శ్రీనివాస్‌కు చెప్పాడు. బుధవారం ముళ్లపొదల్లో శవాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. శవాన్ని రుయాకు తరలించారు. పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు శవాన్ని అప్పగించినట్లు సీఐ చెప్పారు. బాబూరావును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

జనాభా అవగాహన దినోత్సవాన్ని జయప్రదం చేద్దాం

తిరుపతి(కలెక్టరేట్), జూలై 10: ప్రపంచ జనాభా అవగాహన దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో జనాభా దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు కుటుంబ నియంత్రణ, ఆరోగ్యంపై అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాఆరోగ్యశాఖ అధికారి శ్రీహరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైద్య మంత్రికి నర్సుల కృతజ్ఞతలు

తిరుపతి(వైద్యం), జూలై 10: రోగి దాడిలో గాయపడిన కాంట్రాక్టు స్టాఫ్ నర్సు యశోద విషయంలో తక్షణమే స్పందించి అండగా నిలిచిన వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు రుణపడి ఉంటామని రుయాలోని స్టాఫ్‌నర్సులు పేర్కొన్నారు. రుయా పరిపాలన భవనం వద్ద బుధవారం మంత్రి ఫ్లెక్సీ పట్టుకుని వారు కృతజ్ఞతలు తెలిపారు. దాడి విషయం తెలుసుకున్న వెంటనే బాధిత నర్సుకు వేతనంతో కూడిన సెలవులు, వైద్య ఖర్చులు ఇస్తామని చెప్పడం గొప్ప విషయమన్నారు. కాంట్రాక్టు కింద పనిచేస్తున్న స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేసి పనిభారం తగ్గించాలని వారు కోరారు. కార్యక్రమంలో హెడ్ నర్సులు భువనేశ్వరి, శైలజా, రాధ, వరలక్ష్మీ, స్టాఫ్‌నర్సులు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 18 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జూలై 10: మద్యం తాగి వాహనాలు నడిపిన 18మందికి రూ.10,000 వంతున జరిమానా విధిస్తూ నాలుగవ అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ తీర్పు చెప్పారు. గత రెండు రోజుల వ్యవధిలో పట్టుబడిన వారిని ట్రాఫిక్ డీఎస్పీ రమణకుమార్, సిబ్బంది బుధవారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. దీంతో 18 మందిని విచారించిన న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ పై విధంగా తీర్పు చెప్పారు. పాదచారులకు ఇబ్బంది కలిగించేలా తోపుడు బండ్లు, తట్టలు, ఇతరత్రా వస్తువులు పెట్టుకుని విక్రయిస్తున్న 20 మందిని ట్రాఫిక్ పోలీసులు న్యాయమూర్తి ఎదుట హాజరుపరచారు. రూ.500 వంతున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

బడిబయట పిల్లలను బడిలో చేర్పించండి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 10: బడిబయట పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని విద్యాశాఖ అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ ఉంటే విద్యార్హత మేరకు గుర్తించి రెగ్యులర్ లేదా బ్రిడ్జి కోర్సుల్లో ప్రత్యామ్నాయ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రతి విద్యార్థికి విద్యాసామగ్రి అందించాలన్నారు. నేను బడికిపోతా, విద్యాప్రవేశం వంటి ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను అంకితభావంతో అమలు చేయాలని సూచించారు. డీఈవో శేఖర్, అధికారులు విశ్వనాథ్‌నాయక్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనోజ్‌కుమార్ తల్లిదండ్రులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న మహిళలు

తిరుపతి(ఆటోనగర్), జూలై 10: మైనర్ బాలికకు పెళ్లిచేసిన తల్లిదండ్రులపై కేసు నమోదు చేయాలని మృతుడు మనోజ్‌కుమార్ తల్లి బేబిరాణి, సంఘమిత్రలు అరుణకుమారి, హేమలతలు డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. చంద్రగిరి మండలం బీమవరానికి చెందిన మనోజ్‌కుమార్‌కు చిత్తూరుకు చెందిన మైనర్ బాలికతో పెద్దలు గత నెలలో తొండవాడలో పెళ్లి చేశారన్నారు. తాము పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఇరువురి తల్లి తండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారన్నారు. బాలిక తల్లిదండ్రుల ప్రోద్బలంతో మనోజ్‌కుమార్‌పై పోక్సోకేసు పెట్టి జైలుకు పంపారన్నారు. 28 రోజుల అనంతరం మనోజ్‌కుమార్ బెయిల్‌పై విడుదలైనట్లు వారు పేర్కొన్నారు. ఈ కేసు మాఫీకి బాలిక తల్లిదండ్రులు, మనోజ్ తల్లిదండ్రులనుంచి రూ.5 లక్షలు తీసుకున్నారని ఆరోపించారు. అయినప్పటికీ మనోజ్‌కుమార్‌కు బాలిక ఫోన్ చేసి తనను పెళ్లి చేసుకోవాలని పదేపదే కోరుతుండేదన్నారు. ఈక్రమంలో మనోజ్ కుమార్ మనస్తాపంతో ట్రాక్టర్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. కానీ ప్రమాదవశాత్తు పడి మనోజ్‌కుమార్ మృతి చెందాడని పోలీసులు కేసు ముగించారన్నారు. అయితే ఆమైనర్ బాలికకు తల్లిదండ్రులు మరో వివాహం చేశారన్నారు. దీనిపై ఐసీడీఎస్ అధికారులు ఇప్పటివరకు పోలీసులకు ఎలాంటి నివేదిక ఇవ్వలేదన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మనోజ్‌కుమార్ తల్లిదండ్రులకు న్యాయం చేయాలని వారు కోరారు.

టైం స్కేల్ వర్తింప చేసేందుకు సహకారం

ఎన్‌ఎంఆర్‌లకు ఎమ్మెల్యే ఆరణి హామీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 10: ఎస్వీయూలో చాలా ఏళ్లుగా పనిచేస్తున్న ఎన్‌ఎంఆర్ ఉద్యోగులకు టైం స్కేల్ వర్తింప చేసేందుకు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చారు. బుధవారం యూనివర్సిటీకి వచ్చిన ఎమ్మెల్యే ఆరణిని ఎన్‌ఎంఆర్ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు జగదీష్ కలిశారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంఆర్‌ల సమస్యలను ఎమ్మెల్యే ఆరణికి జగదీష్ వివరించారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు జగదీష్ తెలిపారు.

కలెక్టర్‌కు సన్మానం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 10: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వేంకటేశ్వర్‌ను వే ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ పైడి అంకయ్య బుధవారం కలిసి శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో సన్మానించారు. తిరుపతిలో లక్ష మొక్కల పెంపకమే లక్ష్యంగా ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్న కార్యక్రమం గురించి కలెక్టర్‌కు అంకయ్య తెలియజేశారు.



వైసీపీ శ్రేణులకే అత్యధికంగా పంపిణీ
■ నిబంధనలను పట్టించుకోని అధికారులు
■ ఒకే ఇంట్లో రూ.2 కోట్ల పంట రుణాలు
■ ఉద్యోగ నియామకాల్లోనూ చేతివాటం
■ ఐదేళ్లలో గాడి తప్పిన పాలన

డీసీసీబీలో దా'రుణాలు'!

ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లా సహకార కేంద్రబ్యాంకు (డీసీసీబీ) గాడితప్పింది. పాలకవర్గం, అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. రుణాల మంజూరులో వైసీపీ శ్రేణులకే పెద్దపీట వేశారు. కమీషన్లకూ తెరతీశారు. ఉద్యోగ నియామకాల్లోనూ డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. వీటిపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- చిత్తూరు కలెక్టరేట్

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించిన డీసీసీబీలో అవకతవకలు చోటు చేసుకున్నా అడిగే వాళ్లు లేకుండా పోయారు. నిబంధనలకు విరుద్ధంగా రుణాలు మంజూరు చేయడం, తద్వారా కమీషన్లు పొందేవారన్న విమర్శలున్నాయి ఐదేళ్లుగా సింగిల్ విండోలకు ఎన్నికలు జరగకపోవడం, నామినేటెడ్ కమిటీల నియామకంతో సెవెన్‌మెన్ పాలకవర్గం పలుచబడింది. నాటి మంత్రి పెద్దిరెడ్డి ఆశీస్సులతో ఐదేళ్లుగా బ్యాంకు చైర్‌పర్సన్‌గా రెడ్డమ్మ ఉన్నా.. ఆమె భర్త, వైసీపీ నేత కృష్ణమూర్తి హవానే నడిచింది. మీటింగుల్లో ఆయన కూడా కూర్చోవడం, అధికారులకు ఆదేశాలు జారీ చేసేవారు. అధికారులూ ఆయన ఆదేశాలను పాటించేవారు. ఇక, ఇక్కడి కొందరు డైరెక్టర్లు.. బ్యాంకు అధికారులతో కలిసి రుణాలకు సంబంధించిన ప్రతి ఫైలుకూ 10శాతం వసూలుచేసి మంజూరు చేసేవారన్న విమర్శలున్నాయి. లేకుంటే కుంటి సాకులు చెబుతూ బ్యాంకు చుట్టూ తిప్పించుకునే వారని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఇలా కమీషన్ల పేరిటే రూ.లక్షల్లో వసూలు చేశారన్న విమర్శలున్నాయి. ఎక్కువగా పుత్తూరు, నగరి, శ్రీకాళహస్తి, తిరుపతి, పిచ్చాటూరు బ్యాంకు బ్రాంచుల పరిధిలోని రైతులు ఇబ్బంది పడినట్లు తెలుస్తోంది.

రుణాలన్నీ వైసీపీ శ్రేణులకే..

వి.కోట, మదనపల్లె, పలమనేరు, బైరెడ్డిపల్లె, పుంగనూరు తదితర బ్యాంకు బ్రాంచుల్లో వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలు రూ.40 లక్షలకు మించి నిబంధనలకు విరుద్ధంగా మంజూరు చేశారు. వీటిలో 90 శాతం వరకు వైసీపీ నాయకులు, కార్యకర్తలకే సరైన రికార్డులు లేకున్నా ఇచ్చేశారని సమాచారం. ఓ కుటుంబంలో ఒకరికే రుణం ఇవ్వాల్సి ఉంది. వి.కోటలో మాత్రం ఒకే ఇంట్లోని ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.40 లక్షల చొప్పున రూ.రెండు కోట్లు మంజూరు చేయడం గమనార్హం. ఇలా పలు బ్యాంకు శాఖల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మంత్రి పెద్దిరెడ్డి, వైసీపీ నేత కృష్ణమూర్తి ఆదేశాలతో ఇదంతా జరిగినట్లు బ్యాంకు వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అప్పటి మంత్రుల అండదండలతో పాలకవర్గ సభ్యులు వారి బంధువుల పేర్లతో రికార్డులు లేకుండా రూ.10 కోట్ల మేర రుణాలు తీసుకున్నారు. ఒక్క పైసా కూడా ఎవరూ చెల్లించలేదు.

ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు

డీసీసీబీ విస్తరణలో భాగంగా 2022లో నియామకాల్లో జరిగిన అక్రమాలపై బాధితులు గగ్గోలు పెడుతున్నారు. ఉద్యోగ నియామకాల్లో సొసైటీ ఉద్యోగులకు 25 శాతం కేటాయించాలి. ఆ మేరకు మంజూరైన 50 పోస్టుల్లో 12 ఉద్యోగాలు సొసైటీ ఉద్యోగులకు కల్పించారు. ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షల మేర వసూలు చేసినట్లు ప్రచారం జరిగింది. ఈ మొత్తాన్ని అధికారులు, పాలకవర్గం 50.. 25.. 25.. శాతాల చొప్పున పంచుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఉద్యోగ అవకాశాలు ఇస్తామని మరి కొందరు సొసైటీ ఉద్యోగుల నుంచీ కొంత మొత్తాన్ని వసూలు చేసి ఉద్యోగాలు ఇవ్వలేదు. దీంతో బాధితులు పాలకవర్గం, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. పైసా కూడా తిరిగివ్వలేదు. ఏవో కారణాలతో టెర్మినేట్, సస్పెండ్ చేసిన ఉద్యోగుల నుంచీ భారీ మొత్తాల్లో తీసుకుని తిరిగి ఉద్యోగాలు ఇచ్చినట్లు సమాచారం.

అటెండర్, వాచ్‌మెన్ నియామకాల్లో గోల్‌మాల్

బ్యాంకు పరిధిలో 40 బ్రాంచులు ఉండగా, వాటిలో 150 మంది అటెండర్లు, వాచ్‌మెన్ పని చేస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ కింద హైదరాబాద్‌కు చెందిన గాయత్రి సెక్యూరిటీ ఏజెన్సీ ద్వారా వీరిని తీసుకున్నారు. గతంలో 10 మందిని అటెండర్లు, వాచ్‌మెన్‌గా తీసుకోగా, వారిలో 8 మంది మాత్రమే పనిచేస్తున్నారు. జీతాలు మాత్రం పది మందికీ మంజూరు చేస్తున్నట్లు తెలిసింది. ఆ ఇద్దరి జీతాలు కొందరి జేబుల్లోకి వెళ్తున్నట్లు తెలిసింది. ఇలా ఏజెన్సీ ద్వారా జరిగిన నియామకాలు.. ఇప్పుడు పనిచేస్తున్న వారు.. చెల్లిస్తున్న జీతాలపై సమగ్ర విచారణ చేపడితే అసలు అక్రమాలు బయటపడతాయి.

ఓటీఎస్, అమూల్ రుణాల పేరిట అక్రమార్జన

వాయిదా మీరిన అన్నిరకాల రుణాలు మాఫీ చేస్తామని, ఓటీఎస్ పథకం పేరిట మేలు చేస్తామని కొందరు డైరెక్టర్లు, రైతుల నుంచి కమీషన్లు వసూలు చేసినట్లు తెలిసింది. కొన్ని బ్యాంకు శాఖల ద్వారా వైసీపీ శ్రేణులు దొంగ పేర్లతో పాడి పశువులు కొన్నట్లు చూపి.. అమూల్ రుణాలు పొందారు. పెద్దిరెడ్డి ఆదేశాలతో డీసీసీబీ నుంచే వీరికి రూ.20 కోట్ల రుణాలిచ్చినట్లు తెలిసింది. వీటిపైనా సమగ్ర విచారణ జరిపిస్తే నిధులు స్వాహా ఏ మేరకు జరిగాయో బయటపడుతుంది.

రెండోసారీ ఆయనే సీఈవో

సాధారణంగా ప్రతి మూడేళ్లకు బ్యాంకు సీఈవోను మార్చాలి. అలా కాకుండా పాలకవర్గం తమకు అనుకూలంగా ఉన్నారనే ఉద్దేశంతో మనోహర్‌గౌడ్‌ను సీఈవోగా రెండోసారి కూడా కొనసాగించారు. 'పెద్దిరెడ్డి చెప్పారు..' అంటూ డీసీసీబీలో ఎవరికి వారు అక్రమాలకు తెర తీశారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి.. ఐదేళ్లుగా డీసీసీబీలో జరిగిన తంతుపై విచారణ జరిపించాలని రైతులు డిమాండు చేస్తున్నారు.

దస్త్రాలు లేకుండానే విచారణ పూర్తి!

● ఆడిట్ అధికారుల తీరుపై ఫిర్యాదుదారుల ఆగ్రహం

చిత్తూరు రూరల్, జూలై 10: జడ్పీ మాజీ సీఈవో ప్రభాకర్‌రెడ్డిపై విచారణకు సంబంధించి మరిన్ని దస్త్రాలు లేకుండానే ఆడిట్ అధికారులు విచారణ పూర్తి చేసినట్లు తెలిసింది. ఈ మేరకు నివేదిక కూడా సమర్పించినట్లు సమాచారం. దీనిపై ఫిర్యాదుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో జడ్పీ సీఈవో (ఎఫ్ఏసీ)గా ప్రభాకర్‌రెడ్డి అనేక అక్రమాలకు పాల్పడ్డారంటూ విశ్రాంత అధికారి కనకరాజులు నాయుడు, ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి కలెక్టరు షన్మోహన్ ఆదేశాలతో గత నెల నుంచి జిల్లా ఆడిట్ అధికారులు విచారణ ప్రారంభించారు. ఆడిట్ అధికారులు అడిగిన దస్త్రాలను జడ్పీ అధికారులు అందిస్తూ వచ్చారు. విచారణకు కావాల్సిన మరికొన్ని దస్త్రాలు సమర్పించకనే ఆడిట్ అధికారులు విచారణ పూర్తి చేసి నివేదికను కలెక్టర్‌కు అందించినట్లు సమాచారం. పూర్తి దస్త్రాలు లేకుండానే విచారణ పూర్తి చేయడంపై పలువురి నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో జరిగిన ఆడిట్‌లోనూ జడ్పీలో ఎటువంటి అక్రమాలు చోటు చేసులేదని అధికారులు క్లీన్ చిట్ ఇస్తూ వచ్చారు. అయితే జడ్పీలో ప్రభాకర్‌రెడ్డి సీఈవో ఉన్న సమయంలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని విశ్రాంత అధికారి, ఉద్యోగులు ఫిర్యాదులు చేశారు. అయినప్పటికి అప్పటి మంత్రి పెద్దిరెడ్డి అండతో విచారణ చేసేందుకు అధికారులు ముందుకు రాలేదు. దీంతో వారు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీనిపై లోకాయుక్త కమిషనర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. గత రెండు నెలలుగా విచారణ మందకొడిగా సాగుతూనే ఉంది. రెండు రోజులు విచారించి.. నాలుగు రోజులు పట్టించుకునే వాళ్లు కాదు. కానీ, ఇప్పుడు విచారణ పూర్తయిందని కలెక్టర్‌కు నివేదిక ఇచ్చినట్లు సమాచారం.

ఎస్వీయూ రిటైర్డు ప్రొఫెసర్ కన్నుమూత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 10: ఎస్వీ యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగ రిటైర్డు ప్రొఫెసర్ వల్లేరు జయసింహులు నాయుడు (76) అనారోగ్యంతో మృతి చెందారు. నెల రోజులుగా ఊపిరితిత్తుల సంబంధ జబ్బుతో బాధపడుతూ వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి కన్నుమూశారు.చిత్తూరు జిల్లా బంగారుపాళ్యానికి చెందిన జయసింహులు ఎస్వీయూనివర్సిటీలో సుదీర్ఘ కాలం ప్రొఫెసర్‌గా పనిచేశారు. ప్రపంచ బ్యాంకు సౌజన్యంతో ప్రతిష్టాత్మక పరిశోధనా ప్రాజెక్టులు నిర్వహించారు. హ్యూమన్ రైట్స్ అండ్ డెవెలప్‌మెంట్ విభాగాన్ని స్థాపించారు. సీఎం చంద్రబాబుకు సన్నిహితుడైన జయసింహులు సతీమణి పార్వతి మహిళా వర్సిటీ ఉమెన్ స్టడీస్ విభాగంలో ప్రొఫెసర్‌గా, ఆ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా పనిచేశారు. వీరి కుమార్తె అమెరికాలో స్థిర పడ్డారు. ప్రొఫెసర్ జయసింహులు మృతికి ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఛైర్మెన్ పాండ్ర సురేంద్ర నాయుడు, నందనం అకాడమీ డైరెక్టర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్‌గౌడ్ సంతాపాన్ని వ్యక్తం చేశారు. జయసింహులు నాయుడు భౌతిక కాయానికి గురువారం మధ్యాహ్నం గోవింద ధామంలో అంత్యక్రియలు నిర్వహిస్తారు.



ప్రొఫెసర్ జయసింహులు నాయుడు (ఫైల్ ఫొటో)

సీఎం చంద్రబాబు సంతాపం

జయసింహులు మృతికి సీఎం చంద్రబాబు సంతాపాన్ని వ్యక్తం చేశారు. యూనివర్సిటీలో చదువుకునే రోజుల్లో జయసింహులుతో ఎంతో అనుబంధం ఉండేదన్నారు. ఎంతో మంది విద్యార్థులను ఆయన గొప్పగా తీర్చిదిద్దారని ఒక ప్రకటనలో నివాళులర్పించారు. తన రచనలు, ప్రసంగాల ద్వారా అనేక మందికి మార్గదర్శిగా నిలిచారని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

కొత్తపట్నం తీరంలో ఆపరేషన్ సాగర కవచ్

కోట, జూలై 10: మండల పరిధిలోని గోవిందపల్లిపాళెం, కొత్తపట్నం, శ్రీనివాససత్రం సముద్రతీరాల్లో బుధవారం పోలీస్, మెరైన్ పోలీస్ ఆధ్వ ర్యంలో ఆపరేషన్ సాగర కవచ్ కార్యక్రమం జరిగింది. కోట, వాకాడు ఎస్ఐ లు నాగబాబు, పవన్‌కుమార్ ఆయా సముద్రతీరాల్లో మత్స్యకారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సముద్రం నుంచి హఠాత్తుగా తీవ్రవాదులు సమీప గ్రామాల్లోకి చొరబడితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తీరం వెంబడి తీవ్రవాదల సంచారాన్ని ఎప్పటికప్పుడు పసిగట్టి అప్రమత్తం అయ్యే విషయాలను ప్రయోగాత్మకంగా వివరించారు. సముద్ర తీరం వెంబడి సంచరిస్తున్న పలువురిని విచారించారు.

విద్యార్థులతో నేనే ఫోనులో మాట్లాడతా : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 10: పాఠశాలల్లోని మౌలిక సదుపాయాల కల్పన, కొరత, విద్యాబోధన, హాజరు తదితర అంశాలపై తానే విద్యార్థులకు ఫోన్‌చేసి మాట్లాడి తెలుసుకుంటానని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. బుధవారం రాత్రి కలెక్టరేట్‌లో ఆయన విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. తరచూ పాఠశాలలు తనిఖీ చేయాలని, స్థానిక విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. అదే సమయంలో విద్యార్థుల ఫోను నెంబర్లను సేకరించాలని సూచించారు. నిల్వవున్న స్టూడెంట్ కిట్లు, పాఠ్యపుస్తకాలను వెంటనే విద్యార్థులకు అందించాలన్నారు. ఫూస్‌లో సమస్యలుంటే రీప్లేస్మెంట్ చేయాలన్నారు. బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్చేలా వారి తల్లిదండ్రులను ఒప్పించాలని సూచించారు. ఈ విషయంలో ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాల పెంపుపై ఎంఈవోలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, రోజూ ఒక స్కూల్‌ను తనిఖీ చేయాలని ఆదేశించారు. డీఈవో దేవరాజులు, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, డీవైఈవో చంద్రశేఖర్, ఎంఈవోలు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ధ్యేయంగా పని చేయండి

వెంకటగిరి టౌ న్, జూలై 10: గ్రా మాభివృద్ధే ధ్యే యంగా ప్రజా ప్రతినిధులు, అధి కారులు పని చే యాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామ కృష్ణ ఉద్ఘాటిం చారు. బుధవారం ఎంపీ డీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ఐదేళ్లల్లో అభివృద్ధి ఏ పాటి జరిగిందో గ్రామాల్లో పర్యటిస్తుంటే తెలుస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పనుల్లో అధికారులు కూడా మౌనం పాటించారని కూటమి ప్రభుత్వ హయాంలో ఇలా చేస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగేదని, కూటమి ప్రభుత్వం ప్రజలకు జవా బుదారీగా ఉండేలా అధికారులు పనిచేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో సర్వ సభ్యసమావేశంలో పెట్టిన ఒక్క అంశం కూడా పూర్తి చేసిన దాఖలాలు లేవన్నారు. టిడ్కో ఇళ్లలో అర్హులు లబ్ధి పొందేలా చర్యలు తీసు కోవాలని డీఈని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ తనూజ కోరారు. సమావేశం లో ఎంపీడీవో నీలకంఠేశ్వర రెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు, జూ లై 10: పట్టణం లోని రోటరీ భవ న్‌లో బుధవారం రోటరీ క్లబ్ ఆధ్వ ర్యంలో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రతినెలా పేదలకు నిత్యా వసరాలు అందిస్తున్నామన్నారు. జీజీనాయుడు, దశరథరామిరెడ్డి, మయూరి శ్యామ్‌యాదవ్, రవీంద్రరెడ్డి, రాంప్రసాద్, కిరణ్‌చక్రవర్తి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వారాహి అమ్మవారికి పూజలు

గూడూరు అర్బన్, జూలై 10: స్థానిక సాయిసత్సంగ నిల యంలోని విజయ దుర్గాదేవి ఉప పీఠంలో బుధవారం వారాహి అమ్మవారికి హోమం, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ మాట్లాడుతూ... 15వ తేదీ నుంచి అమ్మవారికి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఒందులో భాగంగా వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ శాస్త్రోపేతంగా హోమం, పూజలను నిర్వహించామన్నారు.

వీడిన వైసీపీ గ్రహణం... పేదలకు అందనున్న టిడ్కో గృహం

నాయుడుపేట, జూలై 10: పట్టణాల్లోని పేదల పక్కా గృహాల కల సాకారం టీడీపీ ప్రభుత్వంలో నెరవేరనుంది. నాటి టీడీపీ ప్రభుత్వం షేర్‌వాల్ టెక్నాలజీతో టిడ్కో గృహ సముదాయాలను నిర్మించింది. అర్హులైన లబ్ధిదారులకు లాటరీ పద్ధతిన పారదర్శకంగా ఇళ్లను కేటాయించింది. అయితే 2019లో ఎన్నికల కోడ్ రావడంతో గృహాలను పొందలేక పోయారు.

ఇళ్లకు పట్టిన గ్రహణం...

దాదాపు 80 శాతం పైగా పూర్తైన టిడ్కో పక్కాగృహాల సముదాయాన్ని పూర్తి చేసేందుకు, పేదలకు అందించేందుకు వైసీపీ ప్రభుత్వానికి చర్యలు తీసుకోలేదు. మీనమేషాలు లెక్కిస్తూ 5 సంవత్సరాల కాలయాపనతో పేదలకు పక్కాగృహాలను దూరం చేసింది. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి కారణంగా పక్కాగృహాలు దెబ్బతిన్నాయి.

లబ్ధిదారుల వాటా రూ.3.12 కోట్లు

నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో 2,064 టిడ్కో గృహాలు ఉండగా వాటిలో 300 చదరపు అడుగుల గృహాలు 1152, సింగిల్ బెడ్ రూం (365 చదరపు అడుగులు) గృహాలు 624, డబుల్ బెడ్‌రూం (430 చదరపు అడుగుల గృహాలు) 288 లబ్ధిదారులకు టీడీపీ ప్రభుత్వ హాయంలో కేటాయించారు. 300 చదరపు అడుగులకు రూపాయి వంతున లబ్ధిదారుల వాటా ఉండగా, 365 చదరపు అడుగుల గృహాలకు, 430 చదరపు అడుగుల గృహాలకు లబ్ధిదారులు నాలుగు దఫాలుగా రూ3.12 కోట్లు చెల్లించి ఉన్నారు. లబ్ధిదారులు అప్పు చేసి పక్కాగృహాల కోసం నగదు చెల్లించినా, వైసీపీ ప్రభుత్వంలో వారికి గృహాలు అందించక పోవడంతో వడ్డీలు కట్టలేక అల్లాడిపోయారు.



బిరదవాడ వద్ద టిడ్కో గృహ సముదాయం

రూ.9.67 కోట్ల బ్యాంక్ రుణం...

గత వైసీపీ ప్రభుత్వం సింగిల్ బెడ్‌రూం, డబుల్ బెడ్‌రూంల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల పేరు మీద వివిధ వాణిజ్య బ్యాంకుల ద్వారా రూ.9.67 కోట్లను అప్పటి ప్రభుత్వం రుణం పొందింది. అయితే ఆ రుణాలను దారి మళ్లించింది. దీంతో బ్యాంకర్లు లబ్ధిదారులకు నెలసరి వాయిదాలు కట్టాల్సిందిగా ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. పక్కాగృహాలు అందించకనే వాటిపై రుణాలు పొంది తమపై భారం మోపడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు.

రూ.3.40 లక్షల రుణం అంటున్నారు

430 చదరపు అడుగుల పక్కా గృహం కోసం 2018లో అప్పుచేసి లక్ష రూపాయలు కట్టా.. ఇప్పటి వరకు పక్కాగృహాన్ని అందజేయలేదు. పైపెచ్చు బ్యాంక్‌లో రూ.3.40 లక్షలు రుణం ఉందంటూ, నెలసరి వాయిదాలు కట్టాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. ఇదిచాలా బాధాకరమైన విషయం.

కష్టపడి పనిచేసిన వారికే టీడీపీలో గుర్తింపు: సునీల్‌కుమార్

చిట్టమూరు, జులై 10: టీడీపీలో కష్టపడి పనిచేసే వారికే గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ అన్నారు. టీడీపీ మండల కన్వీనర్ జి.కిషోర్‌నాయుడు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన పార్టీ సమావేశంలో సునీల్‌కుమార్ మాట్లాడుతూ... చిట్టమూరు మండలం టీడీపీకి కంచుకోటని, కొందరు నాయకుల నిర్లక్ష్యం కారణంగా 44 గ్రామాల్లో 21 బూతుల్లో మెజార్టీ తగ్గిందన్నారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ సానుభూతిపరులను గెలిపించుకుంటామన్నారు. మండలంలో పేదల భూములు పెద్దల కబంధ హస్తాల్లో ఉన్నాయని, తాను భూ పంపిణీలో పేదలకు పంపిణీ చేసిన పాసుపుస్తకాలు ఓ వైసీపీ నాయకుడి ఇంట్లో దాచి పెట్టాడన్నారు. రెవిన్యూ అధికారులు ఈ పాసుపుస్తకాలను భయటకు తీయాలని కోరారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ల మంజూరులో అవకతవకలు జరిగాయని ఎంపీడీవో సమగ్రంగా విచారించి నివేదిక ఇవ్వాలన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసశర్మ, ఎంపీడీవో నాగరాజు, డీటీ నిరంజన్‌కుమార్, ఈవోపీఆర్‌డీ మనోహర్‌గౌడ్ సమా వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు.

విజయోత్సవ ర్యాలీ

విజయం సాధించిన తరువాత చిట్టమూరుకు విచ్చేసిన ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు బుధవారం కూటమి నాయకులు ఘనస్వాగతం పలికారు. టీడీపీ మండల కన్వీనర్ జి.కిషోర్‌నాయుడు ఆధ్వర్యంలో శివాలయం నుంచి చిట్టమూరు వరకు గుర్రపు బండిలో ఆయన ప్రయాణించగా నాయకులు, కార్యకర్తలు పూల వర్షం కురిపిస్తూ అభిమానాన్ని చాటుకున్నారు. కృష్ణ మందిరం, తహసీల్దార్ కార్యాలయం వద్ద భారీ గజమాలలతో స్వాగతం పలికారు. అనంతరం టీడీపీ కార్యాలయం వద్ద పార్టీ పతాకావిష్కరణ చేసి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ సముదాయాల ప్రాంగణంలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేసి మొక్కలు నాటారు. నూతనంగా నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. మస్తాన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ఇ. శివకోటారెడ్డి, ఎం.జనార్దన రెడ్డి, భారతమ్మ అనురాధ దేవి, బీజేపీ మండల కన్వీనర్ శరత్‌చంద్రారెడ్డి, జనసేన నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

అన్న క్యాంటీన్ నుంచి సచివాలయం తరలింపు

నాయుడుపేట, జూలై 10: పట్టణం లోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అన్న క్యాం టీన్‌లో నిర్వహిస్తు న్న గెరిడీవీధి సచివా లయాన్ని తరలి స్తున్నట్లు మున్సిపల్ క మిషనర్ జనార్దన రెడ్డి తెలిపారు. క్యాం టీన్‌ను బుధవారం మున్సిపల్ సిబ్బందితో పరిశీలించారు. రాష్ట్రప్రభుత్వం ఆగస్టు 15న రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లను తిరిగి తెరుస్తుండడంతో గెరిడీవీధి సచివా లయం, ఆధార్ సెంటర్‌ను పురపాలక సంఘ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రైవేట్ భవనంలోకి మారుస్తున్నట్లు ఆయన తెలిపారు. సచివాలయ, ఆధార్ సేవలు కొత్త భవనంలో నిరంతరరాయంగా కొనసాగుతాయని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

ఇష్టపడి చదవండి

చిల్లకూరు, జూలై 10: విద్యార్థులు ఇష్ట పడి ఉన్నత స్థానా లకు ఎదగాలని ఏపీ పాఠ్యపుస్తకాల ము ద్రణాలయ డైరెక్టర్ రవీంద్రనాథ రెడ్డి అ న్నారు. బుధవారం మండలంలోని పారి చెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పాఠ్యపుస్తకాలపై అవగాహన కల్పించారు. టెన్త్ విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఎంఈవోలు సంపత్‌కుమార్, రఫూఫ్, హెచ్‌ఎం సుధాకర్, మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాఠ్యపుస్తకాలపై అవగాహన కల్పిస్తున్న రవీంద్రనాథ రెడ్డి

'నేను బడికి పోతా' ర్యాలీ

బాలాయపల్లి/ కోట, జూలై 10: స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు 'నేను బడికి పోతా' కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ బాలా య పల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహబూబ్ సుబానీ మాట్లాడుతూ... బిడ్డల భవిష్యత్తు బాగుండాలంటే ప్రతి తల్లిదండ్రులు బడి ఈడు పిల్లలను పాఠశాలకు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కోట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నేను బడికిపోతాపై అవగాహన ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని ఎంఈవో మస్తానయ్య, హెచ్‌ఎం సురేంద్రబాబు ప్రారంభించారు. బడిఈడు కలిగిన పిల్లలు పాఠశాలలోనే ఉండాలంటూ విద్యార్థులు వీధుల్లో నినదించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న రాయితీలు, అందిస్తున్న విద్యపై అవగాహన కల్పించారు.



కోట పట్టణంలో విద్యార్థుల ర్యాలీ

మన్నారుపోలూరు పాఠశాలలో అక్షరాభ్యాసం

సూళ్లూరుపేట, జూలై 10: మండలంలోని మన్నారుపోలూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆశ్రిత చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం దాత ఇలకా మల్లీశ్వరి సహకారంతో విద్యా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయకుమారి, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సంగీత ప్రసాద్, శ్రీనివాసులు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



డీజిల్ ఒంటిపై పోసుకుంటున్న మహిళా రైతు

సీజేఎఫ్ఎస్ భూముల్లో రగడ

మహిళా రైతు ఆత్మహత్యాయత్నం
ఎమ్మెల్యే జోక్యంతో వెనుతిరిగిన యంత్రాంగం

వెదురుకుప్పం, జూలై 10: వెదురుకుప్పం మండలం దేవరగుడిపల్లె సమీపంలోని సీజేఎఫ్ఎస్ భూముల్లో బుధవారం గొడవ చోటుచేసుకుంది. ఓ మహిళా రైతు ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించగా, అధికారులు వారించారు. బాధితులు తెలిపిన ప్రకారం... ఈ సీజేఎఫ్ఎస్ భూముల్లో దేవరగుడిపల్లెకు చెందిన కొందరు సాగు చేసుకుంటున్నారు. ఎస్ఆర్‌పురం మండలం బోడిదేవరగుడిపల్లెకు చెందిన ఒకరు తనకు ఆ భూమికి సంబంధించిన పట్టాలు ఉన్నాయని వీరిని బెదిరించేవారు. ఈ నేపథ్యంలో బుధవారం వెదురుకుప్పం తహసీల్దార్ జయంత్‌కుమార్ సహా రెవెన్యూ ఉద్యోగులతో ఆ సీజేఎఫ్ఎస్ భూముల్లోకి వచ్చి సర్వే చేస్తామని పనులు మొదలుపెట్టడంతో గొడవ మొదలైంది. తమ అనుభవంలో ఉన్న భూములు తమకు దక్కకపోతే ఆత్మహత్య చేసుకుంటామంటూ ఓ మహిళా రైతు డీజిల్‌ను పోసుకున్నారు. మరో మహిళ కూడా చేతిలో ఉన్న డీజిల్ సీసా చూపి తానూ ఒంటిపై పోసుకుని కాల్చుకుంటానంటూ అధికారులకు స్పష్టంచేశారు. ఏళ్ల తరబడి ఈ భూములు తమ అనుభవంలో ఉన్నాయని వారు తెలిపారు. కాగా, ఒంటిపై డీజిల్ పోసుకున్న.. పోసుకుంటామన్న వారిని తహసీల్దారు వారించారు. కాగా, రెవెన్యూ యంత్రాంగం సర్వేకు రావడంపై ఎమ్మెల్యే థామస్‌కు బాధితులు ఫోనుచేసి చెప్పారు. దీంతో ఆయన ఫోనులో అధికారులతో మాట్లాడటంతో వారు వెనుతిరిగారని బాధితులు తెలిపారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

రేపటినుంచి ధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఈవో ఎన్‌వీఎస్‌ఎన్ మూర్తి

శ్రీకాళహస్తి, జూలై 10: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా చెన్నై రోడ్డులో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను ఈ నెల 12వ తేదీ నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఈవో ఎన్‌వీఎస్‌ఎన్ మూర్తి, ఆలయ అధికారులు, టీడీపీ నాయకులు మునిరాజ నాయుడు, చెంచయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో 12న పాండవ జననం, కౌరవ జననం కథ, ధ్వజారోహణం, 13న పాండవ విద్యాభ్యాసం, 14న హిండింబాసుర, బకాసుర వధ, 15న మత్స్యయంత్ర ఛేదనం, 16న ద్రౌపతీ కల్యాణం, 17న రాజసుయ యాగం, 18న ద్రౌపతీ వస్త్రాపహరణం, 19న అర్జున తపస్సు, అలుగు కుంభాగ్రమున నిలుపుట, 20న ఉత్తర గోగ్రహణం, అర్జునుడు ఆవులను మలవేయుట, 21న ధుర్యోధన, దుశ్శాసన వధ, అమ్మవారి కురులు ముడివేయుట, పూర్ణాహుతి, అగ్నిగుండ ప్రవేశం, 22న వసంతోత్సవం, ధ్వజావరోహణం, 23న కుంభం, 24న పార్వేట ఉత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

నాడు - నేడు నిధుల గోల్‌మాల్
భవనం నిర్మించకుండానే రూ.26లక్షల స్వాహా



అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం

రేణిగుంట, జూలై 10: రేణిగుంట మండలం మామండూరు ప్రాథమిక పాఠశాలలో నాడు - నేడు నిధులు గోల్‌మాల్ అయ్యాయి. పాఠశాల భవనం నిర్మించకుండానే రూ.26లక్షలు స్వాహా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మామండూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండటంతో మరో మూడు గదుల నిర్మాణానికి అనుమతి మంజూరు చేశారు. ఒక్కో గదికి రూ.13లక్షల చొప్పున మూడు గదులకు రూ.26లక్షలు నాడు నేడు పథకం కింద 2022 అక్టోబరులో ప్రభుత్వం నిధులు కేటాయించింది. అయితే భవన నిర్మాణం పూర్తి చేయకుండానే పూర్తయినట్లు రికార్డుల్లో నమోదు చేసి రూ.26లక్షలు బిల్లులు మంజూరు చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కొత్త చట్టాలను రద్దు చేయండి: సీఐటీయూ

సత్యవేడు, జూలై 10: కార్మికుల హక్కులు కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మెలుగు రమేష్ డిమాండ్ చేశారు. సత్యవేడు తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కొత్త చట్టాలను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, 42 రోజుల పాటు జరిగిన సమ్మె కాలంలో మినిట్స్ కాపీలో పేర్కొన్న అంశాలకు జీవో విడుదల చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు తహసీల్దార్ రామాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వ స్థలాల జోలికొస్తే చర్యలు తప్పవు

ఏర్పేడు, జూలై 10: ప్రభుత్వ స్థలాల జోలికొస్తే ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు ఉదయ్‌భాస్కర్‌రాజు హెచ్చరించారు. వికృతమాల రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 132, 133లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఆ స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

సుధీర్‌రెడ్డిని కలిసిన జనసేన ఇన్‌చార్జి

శ్రీకాళహస్తి, జూలై 10: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి కోట వినుత కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన తరువాత మొదటిసారి మంగళవారం సుధీర్‌రెడ్డి నియోజకవర్గానికి విచ్చేశారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యేని కలిసిన ఐఎఫ్‌టీయూ నాయకులు

శ్రీకాళహస్తి, జూలై 10: శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరులో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని బుధవారం ఐఎఫ్‌టీయూ, అంగన్వాడీ, ఆశా యూనియన్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో రాయపనేని హరికృష్ణ, రామిశెట్టి వెంకయ్య, పాటూరు వెంకటరత్నం, కొత్తపల్లి సుబ్రహ్మణ్యం, గుడ్లూరు భారతి, శోభ, స్వర్ణ, వసంత, శాంతకుమారి, వనజ, రాజేశ్వరి, కోమల, పద్మ తదితరుల పాల్గొన్నారు.

సీఎంతో హేమాంబరధరరావు భేటీ



చంద్రగిరి, జూలై 10: చంద్రగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలూ పని చేశానని, నామినేటెడ్ పదవుల కేటాయింపులో తనకు తగిన గుర్తింపు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు విన్నవించారు. బుధవారం విజయవాడలో చంద్రబాబును హేమాంబరధరరావు కలిశారు. ఈ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కోసం తన కృషిని వివరించారు. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించారని హేమాంబ రధరరావు తెలిపారు.

నాణ్యమైన విద్య అందించండి: డీఈవో



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న డీఈవో శేఖర్

ఏర్పేడు, జూలై 10: విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేయాలని డీఈవో శేఖర్ ఉపాధ్యాయులకు సూచించారు. ఏర్పేడు, పాపానాయుడుపేట పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. మూడవ తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. సీ, డీ గ్రేడ్ అభ్యసన సామర్థ్యాలను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించించారు. ఐఎఫ్‌పీ స్మార్ట్ టీవీ ఉపయోగించి బోధించే విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులు ఆంగ్లంలో అలవోకగా మాట్లాడటం చూసి అభినందించారు. మధ్యాహ్న భోజన అమలు గురించి ఆరా తీశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రాజు, ఉపాధ్యాయురాలు నిర్మల, మాధవి పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ముందు
మద్యం మత్తులో యువకుడి హల్‌చల్

రేణిగుంట, జూలై 10: రేణిగుంట అర్బన్ పోలీస్‌స్టేషన్ ముందు బుధవారం రాత్రి ఓ యువకుడు మద్యం మత్తులో హల్‌చల్ చేశాడు. గుర్తు తెలియని యువకుడు పూటుగా మద్యం తాగి పోలీస్‌స్టేషన్ ముందు దాదాపు అరగంట పాటు అరుపులు, కేకలతో పోలీసులకు సవాల్ విసురుతూ ముచ్చెమటలు పట్టించాడు. పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నం చేయగా ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తూ ఊగిపోయాడు. అతికష్టం మీద పోలీసు వాహనంలోకి ఎక్కించి చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని
యువకుడికి తీవ్ర గాయాలు



గాయపడిన మహేంద్ర

వరదయ్యపాళెం, జూలై 10: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన వరదయ్యపాళెం మండలంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... చిన్నపాండూరు సమీపంలోని పెరంటాలమ్మ గుడి వద్ద కంపోస్టు చెత్త వేసే ప్రాంతంలో మహేంద్ర(28) అనే యువకుడు వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. స్థానికులు గుర్తించి 108కు ఫోన్ చేయగా ఆ వాహనం గంట ఆలస్యంగా వచ్చారు. క్షతగాత్రుడిని చిన్నపాండూరు ప్రాథమికి ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కేంద్రమంత్రి బండి సంజయ్‌కు స్వాగతం



కేంద్రమంత్రి బండి సంజయ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

రేణిగుంట, జూలై 10: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో బీజేపీ, జనసేన నాయకులు స్వాగతం పలికారు. బుధవారం ఢిల్లీ నుంచి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయనకు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, బీజేపీ నాయకులు సామంచి శ్రీనివాసులు, భానుప్రకాష్‌రెడ్డి, చంద్రప్ప తదితరులు స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర మంత్రి రోడ్డు మార్గాన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

డయేరియా రాకుండా
జాగ్రత్తలు తీసుకోండి

కేవీబీపురం, జూలై 10: డయేరియా రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ఆరె గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ప్రతి ఇంటినీ సందర్శించి డయేరియా రోగులను పరీక్షించి మందులను అందజేశారు. నిల్వ ఆహార పదార్థాలను తీసుకోవద్దని, తాగునీటి కాచి వడబోసి తాగాలని సూచించారు. పరిసరాల శుభ్రత పాటిస్తే డయేరియా రాకుండా నివారించవచ్చని అన్నారు.

ముక్కంటి ఆలయానికి మహర్దశ తీసుకొస్తా



గోశాలను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 10: పారదర్శక పాలనతో ముక్కంటి ఆలయానికి మహర్దశను తీసుకువస్తామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం ముక్కంటి ఆలయంలోని పలు విభాగాలను ఆయన తనిఖీ చేశారు. ముందుగా 1వ గేటు సమీపంలో సప్తగోకులంలో ఆవుల పోషణ పరిశీలించారు. అనంతరం 1వ గోపురం సెల్‌ఫోన్ కౌంటర్‌లో రూ.5 వసూలు చేయాల్సి ఉండగా రూ.15 వసూలు చేసినట్లు భక్తులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. వెంటనే కౌంటర్‌లో విచారించారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని ఆలయ అధికారులను ఆదేశించారు. తరువాత రాహుకేతు పూజా మండపాల్లో భక్తుల సదుపాయాలపై ఆరా తీశారు. రాహుకేతు పూజలకు సరఫరా చేసే వెండి నాగపడగలు, పూజాసామగ్రి ప్యాకింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రసాదాల నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం సుధీర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ముక్కంటి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. తన తండ్రి, మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ముక్కంటి ఆలయంలో రాహుకేతు సర్పదోష నివారణ పూజలకు శ్రీకారం చుట్టడంతో అంచలంచెలుగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిందని తెలిపారు. ప్రస్తుతం రాహుకేతు సర్పదోష నివారణ పూజల ద్వారా ఆలయానికి ఏడాదికి రూ.130 కోట్ల ఆదాయం చేకూరుతోందన్నారు. రాహుకేతు పూజల్లో ప్రస్తుతం మరికొన్ని సంస్కరణలు పారదర్శంగా తీసుకురావాల్సి ఉందన్నారు. దళారీ వ్యవస్థకు కళ్లెం వెయడంతో పాటు ఆలయ ఆదాయాన్ని మరింతగా పెంచుకునేందుకు కొత్త విధానం అమలు చేస్తామన్నారు. ఆలయ అభివృద్ధి కోసం పలు అంశాలపై దేవదాయశాఖ మంత్రితో చర్చించామని, త్వరలోనే పనులను చేపడుతామన్నారు. అలాగే దాతల సాయంతో ఆలయంలో శిల్పసౌందర్యాన్ని స్వర్ణతాపడంతో తేజోమయంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో ఈవో ఎన్‌వీఎస్‌ఎన్ మూర్తి, టీడీపీ నాయకులు మునిరాజ నాయుడు, చెంచయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు ఆటో సౌకర్యం



ఆటో డ్రైవర్‌కు చెక్కు అందజేస్తున్న ఎంఈవో, ఏన్‌డీఏ కూటమి నేతలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 10: మండలంలోని ఆలత్తూరు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఎన్డీఏ కూటమి నాయకులు ఆటో సౌకరాన్ని కల్పించారు. జూన్ నెలకు సంబంధించిన ఆటో బాడుగు రూ.8వేల చెక్కును ఎంఈవో రవీంద్రనాథ్ చేతుల మీదగా ఆటో డ్రైవర్‌కు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ ఛైర్మన్ సురేష్ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి నాయకులు పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులు పాఠశాలకు రావడానికి ఇబ్బందులు పడుతుండడంతో ఆటో సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించండి



తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

కేవీబీపురం, జూలై 10: స్థానిక తహసీల్దారు కార్యాలయం మండలంలోని అంగన్వాడీ వర్కర్లు బుధవారం ధర్నా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా కోశాధికారి రాజేశ్వరి మాట్లాడుతూ గతంలో బీజేపీ ప్రభుత్వం అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని, ఐసీడీఎస్‌ను బలోపేతం హామీలు ఇచ్చిందని, కానీ ఒక్కటి కూడా నెరవేర్చలేదని తెలిపారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్యాడ్యుటీ అమలు చేయాలని కోరారు. అలాగే కనీస వేతనం, పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని కోరుతూ తహసీల్దారు శ్రీరామ్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్ణ, శ్రీదేవి, భారతి, వసంతకుమారి, మాధవి, మునీశ్వరి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

రోటరీక్లబ్ సేవలు ప్రశంసనీయం

శ్రీకాళహస్తి, జూలై 10: రోటరీక్లబ్ సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. రోటరీక్లబ్ సంస్థాపన దినోత్సవం ఆ సంస్థ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి రోటరీక్లబ్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎలక్ట్ గవర్నర్ బీఆర్ శ్రీదర్, జోనల్ గవర్నర్ హేమచంద్ర, వేణుగోపాల్, వెంకటరామన్, శైలజ, సిద్ధులగారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం ఎంపీడీవోగా ప్రసాద్



వరదయ్యపాళెం, జూలై 10: వరదయ్యపాళెం ఎంపీడీవోగా పి.ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పుత్తూరు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆయనకు సీనియర్ అసిస్టెంట్ మురళీకృష్ణ, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు.

గంగమ్మ ఊరేగింపు



పిచ్చాటూరు, జూలై 10: మండలంలోని కొత్త గొల్లకండ్రిగలో జరుగుతున్న గంగజాతరలో భాగంగా బుధవారం ఉదయం అమ్మవారి గెరిగెతో పాటు గ్రామంలోని మహిళలు పాలపుంతలతో ఊరేగింపుగా గంగమ్మ ఆలయం వద్దకు చేరుకుని అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి కుమ్మరి ప్రతిష్టించి అమ్మవారి విగ్రహాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి చాకలి ఇంటి నుంచి బయలుదేరి గ్రామంలో ఊరేగించారు. ప్రతి ఇంటి ముందు కుంభం వేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఊరేగింపు సందర్భంగా యువకులు ప్రదర్శించి విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అబ్బురపరచారు.

రోడ్డు మరమ్మతుల పేరిట రూ.14లక్షల స్వాహా



గుంతలమయంగా ఉన్న గౌసియా నగర్ రోడ్డు

వరదయ్యపాళెం, జూలై 10: మండలంలోని ఓ మహిళా ప్రజాప్రతినిధి భర్త రోడ్డు మరమ్మతుల పేరిట రూ.14లక్షలు స్వాహా చేశారని వరదయ్యపాళెం మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు నూతలపాటి జయచంద్రనాయుడు ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వైసీపీ చెందిన ఓ మహిళా ప్రజాప్రతినిధి భర్త అధికారాన్ని అడ్డం పెట్టుకుని విజ్ఞాన్‌నగర్ నుంచి గౌసియానగర్ వరకు గ్రావెల్ రోడ్డు మరమ్మతుల కోసం రూ.14లక్షలు మంజూరు చేయించుకున్నారని, అయితే పనులు చేయకుండానే నిధులు నిధులు స్వాహా చేశారని ఆరోపించారు. ప్రస్తుతం ఆ రోడ్డు మొత్తం గుంతలమయంగా మారిందని, చినుకు పడితే గుంతల్లో నీళ్లు నిలిచి బురదగా ఉండడంతో గౌసియానగర్, ముస్లింపాళెం గ్రామాలకు వెళ్లే ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు స్వాహా చేసిన ప్రజాప్రతినిధి భర్త, అతనికి సహకరించిన అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అన్ని రంగాల్లో రజకులకు ప్రాధాన్యత కల్పించండి

ఏర్పేడు, జూలై 10: రజకులకు అన్ని రంగాల్లో ప్రాధ్యానత కల్పించాలని తిరుపతి పార్లమెంటు బీసీ సంఘం నేత సుబ్రహ్మణ్యం మంత్రి డోల వీరాంజనేయ స్వామిని కోరారు. మంత్రిని మంగళగిరిలోని ఆయన చాంబర్‌లో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, మునిరాజా, పద్మజ, రామమూర్తి, రమేష్, ఇంద్రాణి, పుష్ప, అంజలి తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

శ్రీకాళహస్తి, జూలై 10: శ్రీకాళహస్తి నియోజకవర్గ రైతులకు బుధవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు, ఏడీఏ రమేష్‌రెడ్డి, వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

దుకాణాల్లో తనిఖీలు

రేణిగుంట, జూలై 10: రేణిగుంట పట్టణంలో కిరాణా దుకాణాల్లో ఎస్ఐ తరుణ్‌కుమార్‌రెడ్డి పోలీసులు బుధవారం తనిఖీలు నిర్వహించారు.

ఎమ్మెల్యేకు
కేదారనాథ్ ప్రసాదాలు

శ్రీకాళహస్తి, జూలై 10: ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని బుధవారం పట్టణంలోని బీపీ అగ్రహారం యూనిట్ ఇన్‌చార్జి ఆర్ముగం ఊరందూరులోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు కేదారనాథ్, బద్రీనాథ్ ప్రసాదాలను అందించారు.

పుత్తూరు వార్తలు

గజవాహనంపై పరాశరేశ్వరుడి దివ్య దర్శనం



నారాయణవనం, జూలై 10: మండల కేంద్రమైన నారాయణవనంలో వెలసిన చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం గజరాజును వాహనంగా చేసుకుని పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దివ్య దర్శనం కల్పించారు. వేకువజామున స్వామి అమ్మవార్లను మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం వేదమంత్రాల నడుమ ప్రత్యేక పుష్పాలతో, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. తరువాత స్వామి అమ్మవార్లను ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. రాత్రి 7 గంటలకు చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామిని వివిధ పుష్పాలతో అలంకరించి గజ వాహనంపై అధిరోహించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీల సేవలు అమూల్యమైనవి: భానుప్రకాష్



అంగన్వాడీల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జూలై 10: అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల సేవలు అమూల్యమైనవని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. బుధవారం పుత్తూరు పట్టణంలోని ఏడీకే కల్యాణ మండపంలో పుత్తూరు, వడమాలపేట మండలాల అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారుల తొలి అడుగు అంగన్వాడీ కేంద్రమని, వారి భవిష్యత్తుకు పునాది పడేది కూడా కేంద్రాల్లోనని చెప్పారు. చిన్నారుల సంరక్షణతో పాటు వారికి పౌష్టికాహారం అందించడంలో కార్యకర్తలు, ఆయాల కృషిని కొనియాడారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణిలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆయన సూచించారు. ఏ ఇబ్బంది ఉన్నా తనను సంప్రదించవచ్చన్నారు. సీడీపీవో పద్మజ మాట్లాడుతూ గతంలో దివంగత నాయకుడు ముద్దుకృష్ణమ నాయుడు ఉన్నప్పుడు పుత్తూరు ప్రాజెక్టు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చేందుకు తమకు అండదండలుగా ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. మళ్లీ ఆయన కుమారుడిగా ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ నుంచి అదేస్థాయిలో మద్దతు కోరుకుంటున్నామని చెప్పారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే భానుప్రకాష్ చిన్నారులను తన ఒడిలో కూర్చొబెట్టుకుని వారితో ఓం కారాన్ని దిద్దించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు గంజి మాధవయ్య, డీఎన్ ఏలుమలై మొదలియార్, వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, నాయకులు ఎన్ఎన్ ధనపాల్, ఈ.బాబునాయుడు, వేలు, తహసీల్దారు శ్రీనివాసగౌడ్, ఎంపీడీవో ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ సేవలో ఎమ్మెల్యే భాను

వడమాలపేట, జూలై10: మండలంలోని అప్పలాయగుంట వడ్డిపల్లిలో బుధవారం గంగజాతర సందర్భంగా అమ్మవారికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు రఘురామ్, సుబ్బరామయ్య, వెంకటేష్, నాగరాజు, బాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.